PRAMUKHANDHRA 26th Year of Publication We carry the news and views of Telugus




వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీ రామారావు

26 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర

₹.15
నవంబర్ 2020

THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA



అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే



# అ ఆ

**311 నెలలుగా**
**311 సంచికలను**

శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।

# ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల ఱేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)



గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు


**చిరునామా:**
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**




# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

నవంబరు 2020

సంపుటి : 26 (311) సంచిక : 11




# విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తె భారతదేశ పాలనం!

ఇది భారతదేశం. ఈ దేశగడ్డపై నివసించువారెల్లరూ భారతీయులు. భరత జనని అందరికీ తల్లి. ఈ దేశంలో నివసించు హిందువుడైనా, ముస్లిముడైనా, క్రైస్తవుడైనా, మరో శిఖ్ఖుడూ, జైనుడయినా భారత మాత ముద్దుబిడ్డలే! అందరి హృదయాలలోనూ అందర్నీ ప్రేమించే మనసు ఉండాలి. ద్వేషం పెంచుకొనే మనిషి యెప్పుడూ ఏ మతస్థుడూ కాజాలడు. సత్యసాయీ భగవానుడు నుడివినట్టు –

**హృదయమున ప్రేమ పండించుకొనుచున్న**
**వాడె క్రైస్తవుండు, వాడె ముస్లిమ్**
**వాడె మానవుండు వసుధలోన"**

– యన్నది సత్యము. ఈ సత్యమును మరిచిన ఏ మతస్థుడూ మనిషి కానేరడు. అలాటివాడు రాక్షసుడు.

పాలకునికైనా పాలితునికైనా పరపక్ష బేధము ఉండరాదు. ఈ దేశము భారతదేశము ఆనబడు హిందూ దేశమైనప్పటికినీ హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, శిఖ్ఖులు మరెందరో నివశిస్తున్నారు. అందరూ అన్ని ఉన్నత పదవులూ అలంకరిస్తున్నారు. అలాటప్పుడు మనిషికో న్యాయంలా మతానికో న్యాయముండరాదు. సర్వేజనాస్సుఖినోభవన్తు అన్నది సనాతన ధర్మ సారాంశం.

స్వతంత్రం పొందిన తరువాత భారతదేశంలో మతసహనం అనునది మట్టిపాలవుతున్నది. విభజించి పాలించు అన్న బ్రిటీష్ రాజనీతి యింకా దేశపాలకుల్లో ఉన్నది. కలిసి బ్రతుకుదాం అన్న వేదాంత సిద్ధాంతమే తెర మరుగయింది. భరతజాతిని విడగొట్టుటమైంది.


ముస్లిములకున్న ప్రభుత్వ సదుపాయములు హిందువులకు లేవు. వారికి కల్పిస్తున్న రిజర్వేషన్లు హిందువులకు లేవు. వారికి హాజ్ (మక్కా మదీనా) యాత్రకు కల్పిస్తూన్న రాయితీలు, హిందువుల అమర్‌నాథ్‌యాత్రకు గానీ, మానసరోవరయాత్ర గానీ లేవు. క్రొత్తగా క్రైస్తవుల జెరూసలెమ్ యాత్రకు సదుపాయం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావించింది. ఇంకేవో చేయాలనుకున్నది. హైకోర్టు దీనికి అడ్డుపడుతూ మత సంబంధమగు ప్రత్యేక సౌకర్యం కల్పించరాదన్నది. మరోరకంగా ఏమైనా చేయవచ్చునా – యని ప్రభుత్వం భావించినట్టు వార్తాపత్రికల భోగట్టా.

మరొక వివాదం మహిళా రిజర్వేషన్‌లో కుటుంబాన్ని విభజించాలని ప్రభుత్వం యోచిస్తోంది. మహిళలను ఆదరించడంలోనూ, వారికి రక్షణ కల్పించడంలోనూ హక్కులను కల్పించడంలోనూ ఏవిధమైన తప్పూ లేదు. కానీ వారిని ప్రత్యక్ష రాజకీయాల్లో దింపుతూ, భవిష్యత్పౌరులు కావాల్సిన బాలబాలికల బంగారు జీవితం బండలవుతుందని రాజకీయ శాఖలవారు ఆలోచించడం లేదు. వంచింపబడ్తూన్న మహిళలనూ, హింసకు గురియవుతూన్న మహిళల్నూ పట్టించుకోకపోగా, వారిలో వారికి రాజకీయ విబేధాలు కలుగడానికిది దారితీస్తున్నది. ఈ విషయంలో సత్యసాయిబాబావారు అన్న మాటలే నాకు గుర్తొస్తున్నవి!

**ఉద్యోగములు చేయ సువిదలందరు పోవ**
**గృహమును దిద్దెడి గృహిణి ఎవరు?**
**పరబాలలకు నేర్వ పాఠశాలలకు పోవ**
**తమ బాలురకు నేర్పు తరుణిలెవరు?**

– అన్నారు. పదవి కోసంగానీ, భార్యాభర్తా సంపాదిస్తే కానీ డొక్కాడదనే విషయంలో గానీ 'స్త్రీ' తన రోజులోని హెచ్చు జీవితాన్ని వినియోగిస్తున్నప్పుడు పిల్లల్ని లాలించి ఇంట విద్యా బోధనం చేసేదెవరు. తల్లులే పిల్లలకు తొలి గురువయని భారతీయ ధర్మం బోధిస్తూంది. తల్లి ఆలన, బోధన, ఆదరణ, ప్రేమ లేనందున చాలామంది పిల్లలు క్రమశిక్షణ కోల్పోతున్నారు. స్త్రీ మొదట కుటుంబాన్ని పోషించుకునే స్థితిని మరిచిపోతూంది. తల్లిదండ్రులనుగానీ, పిదప అత్తమామలను ప్రేమిస్తూ, గౌరవించే అవకాశాన్ని కోల్పోతూంది. పిల్లలను ఆదరించి, వాళ్లను క్రమశిక్షణలో పెంచే అవకాశమును కోల్పోతూంది. దీనివలన కుటుంబం ఎంతగా నష్టపోతూన్నది గ్రహించలేకపోతున్నారు. పిల్లలు విచ్చలవిడిగా తిరుగుతూ వారిచ్ఛ వచ్చినట్టు, స్వేచ్ఛగా పెడ (ప్రేమ)దారులు తొక్కి బలవన్మరణాల పాలవుతున్నారు.

ఉద్యోగం చేసినా, ఊళ్లు ఏలినా వాళ్లు కుటుంబం పట్ల శ్రద్ధ బూనిననాడే ఈ దేశం ప్రగతిపథంలో నడుస్తూంది. ఈ విపరీత పరిణామములన్నింటికీ విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తే కారణమని చెప్పక తప్పడంలేదు.



*బుధజన విధేయుడు*

***– గోటేటి శ్రీరామారావు***

**(డిసెంబర్ 2009, ప్రముఖాంధ్ర)**


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# హరిహర ప్రీతికరం కార్తీక మాసం

దీపావళి వెళ్లిన మరునాటి నుంచీ వచ్చేది కార్తీకమాసం. మాసాల్లోకెల్లా కార్తీకమాసం గొప్పదియని అంటారు. కార్తీకమాసం ముప్పై రోజులూ పుణ్యప్రదాలే!


**'న కార్తీక సమో మాసోన శాస్త్రం నిగయాత్పరమ్**
**నారోగ్య సమముత్సాహం న దేవః కేశవాత్పరమ్ ।**

– ఈ పై శ్లోకరీత్యా కూడా కార్తీక మహిమ అవగతమవుతూనే ఉన్నది.

ఈ మాసం హరిహరులకు ప్రీతికర మైనది. ప్రతీరోజూ ఇంటి ముంగిట, తులసిముంగిట దీపములు వెలిగించడం పుణ్యకరం. ముఖ్యంగా కార్తీక మాసపు సోమవారములు విధిగా దీపముల్ను వెలిగించాలి. శివాలయంలో శివునికి అభిషేకములు చేయడం, వీలైనచో నదీస్నానం, నదీస్నానము వంటి జల పారుదల కల ప్రదేశాల్లో స్నానం చేయడం, ఏకభుక్తంగా ఆ రాత్రి ఉపవాసం చేయడం శ్రేయస్కరం. సముద్రం దగ్గరగా ఉన్నవారు సముద్రస్నానం చేయడం మంచిదన్నారు.

శివకేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసం ప్రతీరోజు విశిష్టమైనదే! సూర్యోదయానికి ముందే లేచి స్నానమాచరించి, శివకేశవ పూజ చేయాలి. సాయంకాలం వరకూ ఉపవాసం ఉండి, ఆకాశదీపం పెట్టి, నక్షత్ర దర్శనం చేసుకుని, భోజనం చేయడం వలన కూడా పుణ్యముంటుందని పెద్దల అభిప్రాయం. ఈరోజుల్లో 'కార్తీక పురాణం' పఠనం చేయడం, సోమవారాలు, ఏకాదశి, కార్తీక పౌర్ణమి, శ్రవణా నక్షత్రం వచ్చినరోజున పగలు ఉపవాసం ఉండిరాత్రి భోజనం చేయవచ్చు.

ఈ మాసంలో వచ్చెడు కార్తీక శుద్ధ ఏకాదశి దీనినే ఉత్థాన ఏకాదశి అంటారు. యోగనిద్ర నుంచీ విష్ణు భగవానుడు మేల్కొనే ఈరోజునే ఉద్థాన ఏకాదశి అంటారు. ఈ దినమున పూర్తిగా ఉపవాసముండి, విష్ణు సహస్రనామ పారాయణం చేయడమింకా పుణ్యకరం. ఈరోజుననే అంబరీషు చక్రవర్తి ఉపవాసముండిన రోజు.



కార్తీక శుద్ధ విదియనాడు అక్కచెల్లెళ్ల చేతి వంట భుజించాలంటారు. దీనినే భగినీహస్త భోజనం అంటారు. ఇది అక్కాచెల్లెళ్లు, అన్నా తమ్ముళ్ల అనుబంధ అనురాగాలకు చిహ్నం.

ఇహ కార్తీక పౌర్ణమి. ఈరోజున పగలు పూర్తిగా ఉపవాసం ఉండి, విష్ణు ఆలయంలో గానీ, శివాలయంలోగానీ 365 వత్తులు వెలిగించడం, నదుల్లో అరిటిదొన్నెల్లో దీపాలు వెలిగించి, పుణ్యనదుల్లో విడిచిపెట్టడం మహాపుణ్యకరం.

ఈ నెలలో వచ్చే క్షీరాబ్ధి ద్వాదశి ఆనాడు తులసి కోటలో ఉసిరికొమ్మపెట్టి విష్ణువునీ, తులసినీ ఆరాధించాలి. కొందరు తులసి విష్ణుమూర్తుల కల్యాణం చేయడం కూడా పుణ్యకరం.

కార్తీకమాసంలోనే నాగులచవితి వస్తుంది. ఈ చతుర్థిని మహాచతుర్థియని కూడా అంటారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సర్పాకారునిగా పూజిస్తారు. ఆడవాళ్లు పుట్టలో పాలుపోసి నాగదేవతని ప్రార్థిస్తారు. ఇలా చేసినందువలన గ్రహదోష నివారణం కావడమే గాకుండా, చెవి, కన్ను సంబంధిత రోగ నివారణం జరగడం, సత్సంతానం కలుగుతుందని భక్తులు విశ్వాసం. ఆరోజు నాగేంద్రునికి నువ్వులు బెల్లంతో చిమ్మిలి చేయడం, చలిమిడి చేయడం, నానబోసిన సజ్జలు, పళ్లతో నాగేంద్రుణ్ణి పూజించడంతో నాగేంద్రుని పట్ల తమ భక్తి ప్రపత్తులు వెల్లడించుకుంటారు. మరునాడు పుట్టను దర్శించి, ప్రదక్షిణ చేయడం చేస్తారు. ఈశ్వరుడు నాగాభరణుడు, విష్ణువు శేషశయనుడు, ఆదిశేషుడు ఈ భువి భారాన్ని భరించే మహానుబావుడు. కార్తీకమాసంలో నాగపూజ, పుట్టలో పాలు పోయడం శివకేశవులను రంజింపచేసినట్టుంటుంది. అంతేగాకుండా ఈ నెల అంతా దీపతోరణంతో ప్రతీ గృహమూ, దేవాలయమూ జగజ్జేయమానంగా కాంతులీనుతుంది.

ఆశ్వీయుజ మాసంలో దీపావళినాడెన్ని దీపాలు వెలిగిస్తారో అన్ని దీపాలను కార్తీక మాసంలో పౌర్ణమి రోజున వెలిగించడం విశేషం. ●

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*
HOTEL MAYURA
204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :



# తల్లీ జగజ్జనని నీ పాదమే శరణు

శ్రీ గణేశ శారదా గురుభ్యోనమః
తన్నోదంతిః ప్రచోదయాత్

(సీ) నీ నామ స్మరణము నిర్మలత్వము గూర్చు
నీ కథాశ్రవణమ్ము నిన్ను దెల్పు
నీ మంత్ర జపసిద్ధి నీ దర్శనము గూర్చు
నీ పూజ కలిగించు నిత్య భక్తి
నీ పాద పరిచర్య నీ సన్నిధిని గూర్చు
నీదు కైంకర్యంబు మోదమిచ్చు
నీదు నిత్యార్చన నిష్కామ ఫలమిచ్చు
నీ ధ్యానమిచ్చును నిత్య సుఖము

(తే.గీ) **తల్లివని నిన్ను నిరతము దలచిభక్తి**
**యలర సేవించువారి కియభిరతులను**
**గూర్తువని వేడుచుంటి నిన్నార్తితోడ**
**నంబ! వేదాంబ! జగదంబ! అంబికాంబ!** (లక్ష్మీకాంతయోగి)

అమ్మా! నీ నామ స్మరణ ఎన్ని జన్మల భాగ్యమో అని జగదంబికను తలుస్తూ, ఆ తల్లియొక్క వైభవాన్ని మనకందించిన ఋషులు, ఆచార్యులు, గురువులకు ఆదరముతో నమస్సులర్పిస్తూ, అ జగజ్జననికి సంబంధించిన స్తుతిరూపమైన వివిధ శ్లోక మాలికలను విచారణ చేస్తూ అంబ చరణాబ్జమధుమత్తులమౌ భృంగముల మౌదాం.

ఆ జగదంబనేమని పిలవాలి?
ఏ వృత్తంలో వ్రాయాలి?
ఏమని స్తుతించాలి?
ఏ పూలు తేవాలి?
ఏపూజ చేయాలి?

అమ్మయని ఒక పిలుపు చాలదా! కరుణాంతరంగ ఆ జనని మనను కాపాడడానికి! చాలు కదా! మరి గంభీరమైన, గహనమైన అనేకానేక ఇతర స్తోత్రసముచ్ఛయాలెందుకు?!

ఎందుకంటే అవి తెలుసుకోకుండ ఉండలేక, వివిధ రీతుల, చిత్రములైన, గొప్పవైన అమ్మ కథలు, లీలలు వినకుండ, చదువకుండ, చెప్పకుండ, ధ్యానించకుండ, మననం చేయకుండ ఉండలేక!

మరి! అంత గొప్పని తల్లి! జగజ్జనని కదా! సకలానికి జనని ఐనప్పుడు, పిపీలికాది బ్రహ్మ పర్యంతం.. భాషకి, భావానికి సమస్తానికీ ఆమే జనని కదా! ఆమెను బ్రహ్మవిష్ణుమహేశ్వరాదులు ఇంద్రాది దేవతలు ఋషులు నిత్యం కీర్తించి స్తుతిస్తారే! అటువంటి తల్లిని సాధారణ మానవులం మనం స్తుతి చేయడం కుదురుతుందా? సబబేనా? సూర్యునికి దివిటీపట్టడం కాదా? స్తుతి చేసినా ఆతల్లి స్వీకరిస్తుందా? సాధ్యమేనా? వంటి అనేక ప్రశ్నలకు సమాధానం "సుసాధ్యమే, అలా చేయడం సుకృతమే!"

ఎందుకంటే? కారణంఏమిటంటే ? "ఆమె అందరికీ అమ్మ కనుక ". ఎంత పెద్ద పండితురాలైనా తన బిడ్డడు పలికే అసంబద్ధమైన పలుకుల మురిసే తల్లిలా, పిల్లలు బలపంతో పలక మీద వంకరటింకరగా వ్రాసిన వ్రాతలను మురిపెంగా చూసుకునే తల్లిలా, ఎవరు ఏవిధంగా స్తుతించినా వాత్సల్యంతో స్వీకరిస్తుంది.

**పాణ్డిత్యం పరమేశ్వరి! స్తుతివిధౌ నైవాశ్రయన్తే గిరాం**
**వైరిఞ్చ్యపి గుమ్ఫనాని విగలద్గర్వాణి శర్వాణి! తే**
**స్తోతుం త్వామ్ పరిఫుల్లనీలనలినశ్యామాక్షి! కామాక్షి! మాం**
**వాచాలీకురుతే తథాపి నితరాం త్వత్పాదసేవాదరః!!**

(జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ మూకశంకరుల విరచిత స్తుతి శతకారంభ శ్లోకము)

అమ్మా! పరమేశ్వరీ! విప్పారిన నల్ల కలువలవంటి కన్నులు గల ఓ కామాక్షీదేవీ! ఓ శర్వాణీ! నిన్ను స్తుతించడం అనే విషయంలో బ్రహ్మకు సంబంధించిన వాక్కుల యొక్క గాంభీర్యము పటుత్వము కూడా పాండిత్యాన్ని పొందలేక జారిపోతున్నవే! అటువంటి గొప్ప కర్మ యైన నిన్ను స్తుతించుట అనే విషయమందు నీ పాదములజంటపై నాకున్న ఆదరముచేత నిన్ను స్తుతిస్తున్నాను అన్న పేర వాచాలుణ్ణి చేయుచున్నది.

స్తుతి శతకం ఆరంభంలో బ్రహ్మగారిని వారి వాక్కులను స్పృశించారు మూక శంకరులు. క అనే అక్షరం బ్రహ్మను సూచిస్తుంది. ఆ బ్రహ్మయొక్క వాక్కులు అనగా వేదములు లేదా ఆయన శక్తియైన సరస్వతీదేవి అనగా సమస్త వాఙ్మయము అన్ని పలుకుల సారముగా పరిగణిస్తే, ఆపలుకులే అమ్మను నుతి చేసి పాండిత్యాన్ని సాధించి అమ్మ పాదములను పొందలేకపోతున్నవట.

అంశపంచకములో నామరూపములను శబ్దార్థములుగా గ్రహిస్తే, శబ్దార్థములు పార్వతీ పరమేశ్వరులని కదా ప్రమాణము, అదే కదా కాళిదాసా భట్టారకుడు వాగర్థావివసంపృక్తౌ అన్న శ్లోకములో ప్రతిపాదన చేసి రూఢి చేసినది. ఈ శబ్దార్థములు పార్వతీ పరమేశ్వరులైతే, ఆ శబ్దార్థములను ఛందోబద్ధము చేసి పద్యరూపముగానో శ్లోకరూపముగానో నుతిస్తే దేనిని నుతించినట్లు? ఛందస్సు విరాట్పురుషుని పాదములైతే ఆ ఛందస్సు నాధారం చేసుకున్న శ్లోకములు వాటి ప్రతిరూపమేగదా! అనగా, స్తుతిరూపమైన సమస్త వాఙ్మయమూ, శ్లోకములు, పద్యములు వాని పాదములు పరమేశ్వర స్తుతులు అనగా పరోక్షంగా పరమేశ్వరీ రూపమే అనవచ్చు. అంటే, వేదాది సమస్త వాఙ్మయమూ పరమేశ్వరీ స్తుతి రూపమైనప్పుడు అవి పదములతోగూడి పాదములై నడచుచున్నప్పుడు, ఆపాదముల మీద అనురక్తియే, అమ్మవారి పాదములజంటమీద స్తుతి చేయగలిగే అనురక్తిని కూడా కలిగించుచున్నది. అని మూక శంకరుల ప్రతిపాదన.

అంశపంచకము వ అస్తి, భాతి, ప్రియము, నామము, రూపము

ఈ వాక్కులన్ని ఆ బ్రహ్మ అధీనమందుండి ఎల్లెడలా అందరిచేతా, వ్రాస్తున్నవారి చేత, చెప్పుచున్న వారిచేత, వినుచున్న వారిచేత సర్వత్రా సర్వులచే స్వాధ్యాయము చేయబడుతున్నవి. పద్యములలోనూ, శ్లోకములలోనూ పాదములుంటాయి (పంక్తులవంటివి) , వైదిక ఛందస్సు పరాతత్వానికి పాదములని తెల్పబడిందికదా, అప్పుడు దానిననుగమించు పద్య రూపములు, శ్లోకరూపములు ఆమె పాదములే ఔతున్నాయి. అందువలననే అవి "పాదములు" అనే పేరును సార్థక్యము చేసు కున్నాయి. పార్వతీపరమేశ్వరుల రెండు జంటల పాదములుగా లేదా అర్ధ నారీశ్వర

స్వరూపమున చెరియొక పాదముగానూ ఆ పాదములే శ్లోక / పద్య రూపమును పొంది అనుగ్రహించుచున్నవి. అంటే, ఆమె పాద సేవాదరమే (ఛందోబద్ధమగు స్తుతిరూపములే) ఆమె యందు భక్తిచేత ఆ పాదములను స్తుతించు శక్తిని కలిగించుచున్నది తప్ప, నేను వ్రాయగలను స్తుతించగలను అన్న శక్తి, అహం భావము కాదు కాదు అని ప్రతిపాదన.

ఈ విధమైనటువంటి శ్లోకమే మునుపు **మహిమ్నః పారం తే పరమవిదుషో యద్యసదృశీ స్తుతిర్బ్రహ్మాదీనామపి తదవసన్నాస్త్వయి గిరః ...** అంటూ బ్రహ్మాది దేవతలే నీ స్తుతి చేయలేకున్నారంటూ పుష్పదంతాచార్యుడు శివమహిమ్నాస్తోత్రము మొదటలో ప్రకటించారు! ఇటువంటి భావనను మూర్తీభవించిన వినయ సంపన్నులు తన వాగరితో సమస్త బ్రహ్మాండాన్నీ కప్పేసిన శంకరభగవత్పాదులంతవారు ప్రకటించారు. ఎందరో మహా మహా పండితులు భక్తాగ్రేసరులైనవారు తమ తమ వినయ సంపదను ఆ జగజ్జననీజనకుల ప్రకటనచేయడం మనకు మార్గదర్శకత్వమే!

ఈ వ్యాసం మొదట్లో శ్రీలక్ష్మీకాంతయోగి కృతమైన పద్యములో,

**తల్లివని నిన్ను నిరతము దలచిభక్తి**
**యలర సేవించువారి కియభిరతులను**
**గూర్తువని వేడుచుంటి నిన్నార్తితోడ**
**నంబ.........** ఆ జగదంబికను మనసారా "తల్లీ" యని తలుస్తేనే సకల అభీష్టాలూ సిద్ధింపజేసేదానవు అంటూ ప్రకటించారు.

పూర్వం మహా తపస్వులైన అప్పయ్య దీక్షితులు మరియు నీలకంఠ దీక్షితుల మధ్య చర్చ జరిగిందట.. మహాపురుషులు ఒకచోట చేరితే వారి సంభాషణలలో అమృత గుళికలు రాలతాయి. ఒడిసి పట్టుకోవడం అనుయాయుల విధి. ఒకనాడు అప్పయ దీక్షితులవారు నీలకంఠ దీక్షితులవారు కలుసుకుని మాట్లాడుకుంటున్నారు. ఇద్దరూ మహాపండితులు ఎవరూ తక్కువకాదు, పూర్వం వ్యాస - శంకరులు చర్చలాగా సాగుతోందట. అకస్మాత్తుగా

అప్పయ దీక్షితులు : ఆపది కిం కరణీయం?

(ఆపదలలో ఏమి చేయవలె అని అడిగారట). అప్పుడు,

నీలకంఠ దీక్షితులు : స్మరణీయం చరణమమ్బాయాః!

(ఆపదలలో అమ్మవారి పాదములను స్మరించవలెను అని బదులిచ్చారు.) అప్పుడు

అప్పయ దీక్షితులు : తత్స్మరణం కిం కురుతే?

(అలా ధ్యానిస్తే ఏం జరుగుతుంది అని రెట్టించి అడిగారట), అందుకు,

నీలకంఠ దీక్షితులు : బ్రహ్మాదీనామపి కింకరీ కురు తే!

(ఆ స్మరణ బ్రహ్మాది దేవతలనే నీకు కింకరులుగా ఇస్తుంది అని బదులిచ్చారట)

అంటే ఎంత ఆపదలో ఉన్నా అమ్మా అని నిజాయితీగా నమస్కరించి అమ్మ చరణాలను పట్టుకుంటే, జీవనరేఖ గీసిన బ్రహ్మవ్రాతయైనా, దాన్ని అనుభవంలోకి తెచ్చే నవగ్రహ సంచార ఫలితాలైనా అనుకూలంగా మారి ఆపదలు తొలగవలసినదే! అదీ అమ్మ చరణ స్మరణ మహత్తు.

ఇలా అమ్మ గురించిన అమృత తుల్యమైన విషయాలెన్నో, అమ్మే అమృతం కదా!

**సశేషం**

కూర్పు, సంకలనం : **శంకరకింకర (శ్రీ అయ్యగారి నాగేంద్ర కుమార్)**






# ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలిగా

# ఇందిరాదత్



చెన్నైలోని ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలిగా కేసీపీ లిమిటెడ్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ రెండోమారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ వాణిజ్య మండలి సర్వసభ్య సమావేశంలో ఈమేరకు సభ్యులంతా కలిసి ఆమెను ఎన్నుకున్నారు. ఇదేవిధంగా ఆ సంస్థ ఉపాధ్యక్షులుగా ట్రావెల్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ ఛైర్మన్ సి.నాగేంద్రప్రసాద్, వీజీపీ హోమ్ ప్రమోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మళ్లీ ఎన్నికయ్యారు. సంస్థ కొత్త అధ్యక్షురాలిగా రెండోమారు పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ మాట్లాడుతూ 92 యేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు రెండోమారు అధ్యక్షురాలిగా ఎన్నిక కావడం తనకెంతో ఆనందంగా ఉందని, సంస్థ అభివృద్ధికి మునుపటిలాగే సహాయ సహకారాలందిస్తానని తెలిపారు. ప్రస్తుతం కరోనా వైరస్ వ్యాప్తి సృష్టించిన సంక్షోభ పరిస్థితుల్లో సంస్థ సభ్యులంతా కలిసికట్టుగా సంస్థను అభివృద్ధిపరచేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కరోనా కష్టకాలంలో ప్రతికూలతకు దూరంగా ఉండాలని, విశ్వాసం కోల్పోవద్దని ఆమె సభ్యులను కోరారు. తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోను వృత్తినైపుణ్యంతో ఆంధ్రా ఛాంబర్‌ను ఉన్నత స్థితికి చేర్చేందుకు కార్యనిర్వాహక కమిటీ సంపూర్ణ మద్దతునివ్వాలని ఇందిరాదత్ విజ్ఞప్తి చేశారు.






# ఆంధ్రుల అభిమాన గయ్యాళి అత్తగారు
# సూర్యకాంతం

సూర్యకాంతం, ఈ పేరు వింటేనే ఆంధ్రా కోడళ్ళకు హడల్. తల్లిదండ్రులు తమ కూతురికి సూర్యకాంతం పేరు పెట్టడానికి ఈ నాటికీ సాహసించరు. నిజ జీవితాల్లో ఏ అత్తగారైనా గయ్యాళి అయితే 'అమ్మో – ఆవిడా? సూర్యకాంతమే!' అని అందరూ భయపడి చెప్పుకునే స్థాయిలో సహజంగా నటించింది సహజనట కళా శిరోమణి సూర్యకాంతం. విశేషం ఏమిటంటే, అత్తగారి పాత్రలో ఆమె కనిపించినా, అమెగయ్యాళే అని తెలిసినా–ఎన్ని సినిమాల్లో చూసినా ఏ మాత్రం విసుగు అనిపించకపోవడమే! ఒకే రకం పాత్రల్ని పోషించి – అంతకాలంపాటు, అన్ని సినిమాల్లో నటించి ప్రేక్షకుల మెప్పు పొందడానికి కారణం ఆమె సహజ నటన.

ప్రసిద్ధ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు ఒకసారి టెలివిజన్ ఇంటర్వ్యూలో తాను హాస్యానికి సూర్యకాంతంతో స్వయంగా ఇలా అన్నానని చెప్పారు – "నువ్వు తెలుగు భాషకు చేసిన అన్యాయం ఒకటుంది. 'సూర్యకాంతం' అనే చక్కని పేరు ఇంకెవరూ పెట్టుకోకుండా చేశావు"

**జీవిత విశేషాలు**

- సూర్యకాంతం గారు తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ దగ్గరున్న వెంకటక్రిష్ణరాయపురం లో 1924 అక్టోబర్ 28న తన తల్లిదండ్రులకు 14వ సంతానంగా జన్మించింది.
- సూర్యకాంతం గారి తండ్రి పేరు పొన్నాడ అనంతరామయ్య గారు, తల్లిపేరు వెంకట రత్నమ్మ గారు.
- సూర్యకాంతం గారి భర్తపేరు పెద్దిబోట్ల చలపతిరావు గారు (హైకోర్టు జడ్జీ, వీరి వివాహం 1950 లో జరిగింది.)
- సూర్యకాంతం గారు వృత్తిలో సాధించిన విజయాలు సహజ నట శిరోమణీ, హస్య నట శిరోమణి, బహుముఖ నటనా ప్రవీణా, రంగస్థల సిరోమణి.
- (1) సూర్యకంతం గారికి మహానటి సావిత్రి గారి జ్ఞాపకచిహ్నము పురస్కారం లభించింది. (2) గౌరవ డాక్టరేట్ పురస్కారాని పద్మావతి మహిళా యూన్వర్సిటీ నుండి అందుకొన్నారు.
- సూర్యకాంతం గారు నటించిన మేటి చిత్రాలు బ్రతుకుతెరువు, దొంగరాముడు, మాయాబజార్, తోడికోడళ్ళు, అప్పుచేసి పప్పుకూడు, మాంగల్యబలం, ఇద్దరు మిత్రులు, వాగ్దానం, వెలుగునీడలు, మంచిమనసులు, రక్తసంబంధం, సిరిసంపదలు, గుండమ్మకథ, చదువుకున్న అమ్మాయిలు, మూగమనసులు, డాక్టర్ చక్రవర్తి, ఉమ్మడికుటుంబం, ఆత్మీయులు, దసరాబుల్లోడు, అమాయకురాలు, కాలం మారింది మొదలగునవి.
- సూర్యకాంతం గారు ఒక ప్రముఖ సినీ నటి. తెలుగు సినిమాల్లో గయ్యాళి పాత్రల్లో తన సహజ నటనతో ప్రాచుర్యం పొందింది.
- కోడరికం సినిమా ఆమెకు ఎంతో పేరు తీసుకొచ్చింది. బి.నాగిరెడ్డి, చక్రపాణి లు ఆమె లేకుండా సినిమాలు తీసేవారు కారు.
- ఆ రోజుల్లోని అనేక సాంఘిక చిత్రాల్లో రేలంగి – సూర్యకాంతం, రమణారెడ్డి – సూర్యకాంతం, ఎస్.వి.రంగారావు – సూర్యకాంతం– జంటలు, వాళ్ల దృశ్యాలు గుర్తుకు తెచ్చుకుని ఇవాళ కూడా హాయిగా నవ్వుకోవడం కద్దు. కొత్త సినిమా వస్తుంటే అందులో సూర్యకాంతం వుందా? అని ప్రేక్షకులూ, తారాగణంలో సూర్యకాంతం వున్నట్టేగదా? అని సినిమా డిస్ట్రిబ్యూటర్లూ – ఎదురు చూసేవారు.
- సూర్యకాంతాన్ని హాస్యనటీమణిగా ముద్ర వెయ్యడానికి లేదు. ఆమె ప్రత్యేకంగా హాస్యం చెయ్యకపోయినా ఆమె సంభాషణ చెప్పే తీరు, నవ్వు తెప్పిస్తుంది, చేసే చేష్టలు కోపం తెప్పిస్తాయి. అలా అని ఆమె దుష్టపాత్రధారిణి అని కూడా అనలేం. సహాయ నటి అనే అనాలి. గయ్యాళి అత్తకి మారుపేరు సూర్యకాంతం అనిపించుకుంది. ఓర చూపులు చూస్తూ, ఎడంచెయ్యి విసుర్తూ కుడిచెయ్యి నడుం మీద నిలబెట్టి ఆమె చెప్పిన సంభాషణా చాతుర్యం, అంతలోనే వెక్కిరిస్తూ, అంతలోనే కల్లకబుర్లతో బొల్లిడుపులు ఏడుస్తూ ఆమె ధరించిన అత్త పాత్రలు సజీవ శిల్పాలు.
- సూర్యకాంతం గారి ఆఖరి చిత్రం ఎస్ పి పరశురాం (1994).
- సూర్యకాంతం గారు డిసంబర్ 18, 1994న హైదరాబాదులో తన 70వ ఏట మరణించారు.

**నటించిన సినిమాలు**

ధర్మాంగద (1949), సంసారం (1950), పెళ్ళిచేసి చూడు (1952), బ్రతుకుతెరువు (1953), కన్యాశుల్కం (1955) (మీనాక్షి), దొంగరాముడు (1955), చరణదాసి (1956), శ్రీ గౌరీ మహత్యం (1956), భాగ్యరేఖ (1957), మాయాబజార్ (1957), తోడికోడళ్ళు (1957), దొంగల్లో దొర (1957), అప్పుచేసి పప్పుకూడు (1959), మాంగల్యబలం (1959), కృష్ణలీలలు (1959), భాగ్యదేవత (1959), జయభేరి (1959), శాంతినివాసం (1960), ఇద్దరు మిత్రులు (1961), పెళ్లికాని పిల్లలు (1961), భార్యా భర్తలు (1961), వాగ్దానం (1961), వెలుగునీడలు (1961), శభాష్ రాజా (1961 కలసి ఉంటే కలదు సుఖం (1961), మంచిమనసులు (1962), రక్తసంబంధం (1962), సిరిసంపదలు (1962), గుండమ్మకథ (1962), తిరుపతమ్మకథ (1963), నర్తనశాల (1963) (అథిది పాత్ర), పరువు ప్రతిష్ఠ (1963), చదువుకున్న అమ్మాయిలు (1963), మురళీకృష్ణ (1964), మూగమనసులు (1964), డాక్టర్ చక్రవర్తి (1964), ఉయ్యాల జంపాల

# సూర్యకాంతం మరణవార్త

రిపోర్టర్లకు పగలు కాస్త తక్కువ పని ఉండి సాయంత్రమయ్యే కొద్దీ పెరుగుతూ ఉంటుంది. రాత్రి ఎప్పటిదాకా పని ఉంటుందో చెప్పలేం. 1994 డిసెంబర్ 17 కూడా అలాంటి ఒకానొక సాయంకాలమే. పగలంతా దాదాపుగా ఖాళీగానే ఉన్నా. ఇంటికి బయల్దేరబోతుండగా విజయవాడ ఆఫీసులో పనిచేసే ఒక జర్నలిస్టు ఫోన్ చేశాడు. వాళ్ళ పైపోర్షన్‌లో ఉండే సూర్యకాంతం బంధువులు హడావిడిగా ఇంటికి తాళం వేసి చెన్నై బయల్దేరారనేది ఆ ఫోన్ కాల్ సారాంశం. సూర్యకాంతానికి ఏమైనా అయిఉంటుందేమో తెలుసుకొమ్మని పరోక్షంగా నాకు చెప్పాడన్నమాట.

నేను వెంటనే సినిమా డైరెక్టరీ తీసి సూర్యకాంతం గారింటికి ఫోన్ చేశా. అప్పుడు సెల్ ఫోన్లు లేవు. ఫోన్ రింగవుతూనే ఉంది. ఎవరూ తీయడం లేదు. నేనేమన్నా అతిగా ఊహిస్తున్నానేమోనని కాసేపు అనిపించినా, ఏ అవకాశాన్నీ వదులుకోకూడ దన్నది వృత్తి పాఠాల్లో ఒకటిగాబట్టి ఆమె గురించి తెలుసుకోవటానికి రకరకాలుగా ప్రయత్నించా. కనీసం ఆవిడ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరినట్టు సమాచారం ఉన్నా నా పని తేలికయ్యేది. ఆమె అస్వస్థత గురించి అడిగితే ఎవరైనా చెబుతారేమోనని ప్రయత్నించి చూశా. దాసరి నారాయణరావు, రేలంగి నరసింహారావు తదితరులతో సహా దాదాపు 25 మందికి ఫోన్ చేసి మాట్లాడి ఉంటా. ఆమెకు ఆరోగ్యం సరిగా లేదన్న విషయాన్ని ఆ మధ్య విన్నామని చెప్పినవాళ్ళేవరూ కనీసం ఆమె ఇంటివైపు కన్నెత్తి చూడలేదు. వివరాలేవీ తెలియదన్నదే అందరి సమాధానం.

నేను ఆ డైరెక్టరీ లో ఉన్న అడ్రెస్ వెతుక్కుంటూ వెళ్ళా. ఆళ్వార్ పేట లో ఉన్న సి ఐ టి నగర్. అప్పటికి రాత్రి తొమ్మిది గంటలైంది. మద్రాస్ నగరంలో ప్రజలు త్వరగా నిద్రపోతారు. ఈ మధ్య పరిస్థితి కాస్త మారిందిగాని మద్రాస్ గురించి పెంగ్విన్ వాళ్ళు ప్రచురించిన ఒక పుస్తకంలో కూడా The city goes to sleep early అని రాశారు. అది ఎగువ మధ్య తరగతి నివసించే ప్రాంతం కావటం, చలికాలం కూడా కావటంతో కాలనీ నిర్మానుష్యంగా ఉంది. అడ్రస్ ప్రకారం వెళ్ళానుగాని ఆ ఇల్లో కాదో తెలుసుకోవటానికి దగ్గర్లో ఒక ఇంటి వాచ్ మన్ దగ్గరికెళ్ళి అడిగా. ఆ ఇల్లేనని చెప్పాడు తప్ప అంతకుమించి వివరాలేమీ ఇవ్వలేకపోయాడు. ఇంటికి తాళం వేసి ఉంది. మధ్యాహ్నం దాకా ఉన్నారని మాత్రం చెప్పగలిగాడు. ఏం చేయాలో పాలుపోవటం లేదు. అరకిలోమీటర్ నడిచి ఆళ్వార్ పేట దాకా వెళ్ళి ఆఫీసుకు ఫోన్ చేశా... వాళ్ళకేమైనా వివరాలు అందాయేమో తెలుసుకుందామని. ఫలితం శూన్యం. నేనేమైనా చెబుతానేమోనని వాళ్ళే ఎదురుచూస్తున్నారు. ఫోన్ పెట్టేసి మళ్ళీ ఆ ఇంటి దగ్గరికే వచ్చా.

అరగంటకు పైగా ఓపిగ్గా అక్కడే తచ్చాడుతూ ఉండిపోయా. తొమ్మిదిమ్ముప్పావుకు ఒక తెల్ల అంబాసిడర్ కారు ఆ ఇంటి ముందాగింది. ఒక్కసారిగా అలర్ట్ అయ్యా. అందులో నుంచి ఒక పెద్దాయన దిగాడు. ఆయన వెంట దిగిన మరో మధ్యవయస్కుడు చంకలో చెక్కకర్ర సాయంతో నడుస్తున్న పోలియో బాధితుడు. ఇద్దరూ ఆ ఇంట్లోకి వెళుతుంటే నేను కూడా మెల్లగా అనుసరించా. వెనుక ఎవరో వస్తున్నట్టు గమనించినట్టున్నారు. వెనక్కి తిరిగి ప్రశ్నార్థకంగా చూస్తున్నారు. ఇలాంటప్పుడు సంభాషణ ఎలా మొదలుపెట్టాలన్నది చాలా ఇబ్బందికరమైన విషయం. కానీ చల్లకొచ్చి ముంతదాచటం వల్ల ప్రయోజనంలేదు. "సూర్యకాంతం గారి ఇల్లు.." అంటూ వాక్యం మధ్యలోనే మింగేశా. ఆ పెద్దాయన వెంటనే, "బాడీ వెనుక అంబులెన్స్‌లో వస్తోంది... ఇంతకీ మీరెవరు?" అన్నారు. నన్ను నేను పరిచయం చేసుకున్నా. ఆ పెద్దాయన సూర్యకాంతం గారి కజిన్ అని, మధ్య వయస్కుడు ఆమె పెంపుడు కొడుకని వాళ్ళను వాళ్ళు పరిచయం చేసుకున్నారు.

ఆంధ్రాకోడళ్ళను హడలెత్తించిన అభిమాన అత్తగారు సూర్యకాంతం ఇక లేరన్నవార్తను వెంటనే ఆఫీసుకు చెప్పాలన్న ఆతృత మొదలైంది. అంబులెన్స్ లో భౌతికకాయం వచ్చేదాకా ఆగటమా, టెలిఫోన్ బూత్ దాకా వెళ్ళి ఫోన్ చేసి రావటమా అని తటపటాయిస్తుండగా సూర్యకాంతంగారి పెంపుడు కొడుక్కి నా సమస్య అర్థమైనట్టుంది. ఫోన్ చేసుకుంటారా అని అడిగి నన్ను ఆ ఫోన్ ఉన్న గదిలోకి తీసుకెళ్ళారు. ఆఫీసుకి ఫోన్ చేసి సూర్యకాంతం మరణ వార్తను ధ్రువీకరించా. వార్త రాసి ఉంచితే అరగంటలో ఆఫీసుకొచ్చి మిగిలిన వివరాలతో నింపుతానని చెప్పా. ఫోన్ పెట్టెయ్యగానే ఆయన మరిన్ని వివరాలు చెప్పాడు. మొదటి సినిమా ధర్మాంగద, చివరి సినిమా వన్ బై టూ లాంటి సంగతులు, కుటుంబ వివరాలు చెప్పాడు.

అంతలో అంబులెన్స్ వచ్చింది. సూర్యకాంతం గారి కోడలు వెంట వచ్చారు. అందరం కలిసి సూర్యకాంతం గారి భౌతికకాయాన్ని ఇంట్లోకి చేర్చాం. బంధువులకు సమాచారం ఇచ్చామని, ఉదయానికి వాళ్ళంతా వస్తారని, మధ్యాహ్నంలోపు అంత్యక్రియలు జరుపుతామని చెప్పారు. సినిమావాళ్ళకెవరికీ చెప్పలేదని, చెప్పే ఉద్దేశం కూడా లేదని చెప్పారు. అప్పుడక్కడ ఉన్నది ముగ్గురే. సోదరుడు, కొడుకు, కోడలు. సి ఐ టి నగర్ నిద్రలో మునిగిపోయింది. ఆ ముగ్గురికే జాగారం. నేను సెలవు తీసుకొని బయల్దేరి ఆఫీసుకొచ్చా.

వార్త పూర్తిచేసి బయల్దేరబోయేముందు అనిపించింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్ర ప్రభ తప్ప ఏ పత్రికలోనూ రేపు ఈ వార్త వచ్చే అవకాశంలేదన్న నిజం గుర్తుకొచ్చింది. తెలుగునాట ఇంటింటా నోళ్ళలో నానే ఒక మహానటి మరణిస్తే ఆ వార్త నాకు మాత్రమే తెలిసినంత మాత్రాన ఇప్పటి న్యూస్ చానల్స్ లా ఎక్స్ క్లూజివ్ అని భుజాలు చరుచుకోవాల్సిన అవసరం లేదు కదా. అన్ని పత్రికలకూ ఫోన్ చేసి చెప్పటం కష్టం కాబట్టి వార్తా సంస్థ యు ఎన్ ఐ బ్యూరో చీఫ్ రమేశన్ కి ఫోన్ చేశా. అందులో వెంకట రమణ అనే తెలుగు రిపోర్టర్ ఉన్నాడు గాని అతను ఈనాడుకు ఫ్రీ లాన్సర్ గా వార్తలు రాస్తూ ఉంటాడు. అతనికి చెబితే ఈనాడుకు మాత్రమే పంపుతాడనే అనుమానంతో రమేశన్ కి చెప్పాల్సి వచ్చింది. పైగా నా అనుమానాన్ని కూడా రమేశన్ కి చెప్పా. మొత్తానికి ఐదు నిమిషాల లోపే యు ఎన్ ఐ ఆ వార్తను దేశమంతా అందించింది. అలా తెలుగునాట  పత్రికలన్నీ ఆ వార్త ప్రచురించగలిగాయి.

వార్త సంగతలా ఉంచితే ఆ రాత్రి నేను ఫోన్ చేసిన పాతికమందిలో ఎవరూ మళ్ళీ ఫోన్ చేసి మీకేమైనా వివరాలు తెలిశాయా అని అడిగిన పాపాన పోలేదు. మరునాడు ఉదయం వెళ్ళినప్పుడు బంధువులు మాత్రమే ఉన్నారక్కడ. తెలుగునాట ఏ తల్లిదండ్రులూ  వాళ్ళ పిల్లలకు సూర్యకాంతం లాంటి మంచిపేరు పెట్టుకోకుండా చేశావ్ అని నిందాపూర్వకంగా పొగిడిన సహనటుడు గుమ్మడి గాని, చిత్రరంగం నుంచి ముఖ్యమంత్రి స్థానం అందుకొని మూడోవిడత ఎన్నికైన ఆనందంలో మునిగి తేలుతున్న ఎన్టీ రామారావు గాని కడసారి వీడ్కోలు పలికేందుకు రాలేదు. మద్రాసులో ఉన్న సినీజనాలే చాలామంది అంత్యక్రియలకు రాలేదు. హైదరాబాద్ విమానం వచ్చే సమయం దాకా వేచి చూసిన ఆమె కుటుంబ సభ్యులు మధ్యాహ్నానికి అంత్యక్రియలు జరిపారు.

తన బాగోగులు చూసుకుంటూ తన కుటుంబానికి అండగా నిలిచిన తన కజిన్‌కి తన ఆస్తిలో వాటా ఇస్తూ సూర్యకాంతం వీలునామా రాయిస్తే ఆయన పేరు స్థానంలో లాయర్ తనపేరే రాసుకొని మోసం చేశాడు. సోదరి మరణం మిగిల్చిన దుఃఖంలో ఉండగానే ఆ లాయర్ వచ్చి తనదేనంటూ ఇల్లు స్వాధీనం చేసుకోవడంతో వారం తిరక్కుండానే ఆయన గుండెపోటుతో  ప్రాణాలొదిలారు.

**– తోట భావనారాయణ**

(1965), నవరాత్రి (1966), సంగీతలక్ష్మి (1966), ఆస్తిపరులు (1966), కన్నెమనసులు (1966), బ్రహ్మచారి (1967), సుఖ దు:ఖాలు (1967), ఉమ్మడికుటుంబం (1967), అత్తగారు–కొత్తకోడలు (1968), బుద్ధిమంతుడు (1969), ఆత్మీయులు (1969), బాలరాజు కథ (1970), దసరాబుల్లోడు (1971), అమాయకురాలు (1971), కాలం మారింది (1972), కొడుకు కోడలు (1972), అందాల రాముడు (1973), ముత్యాల ముగ్గు (1975), సెక్రటరి (1976), గోరంతదీపం (1978), రాధాకృష్ణ (1978), కార్తీక దీపం (1979) (శారదా తల్లి), వియ్యాలవారి కయ్యాలు (1979), చుట్టాలున్నారు జాగ్రత్త (1980), పెళ్ళిచూపులు (1983 బంధువులు వస్తున్నారు జాగ్రత్త (1989), వన్ బయ్ టూ (1993) ●



# 'ఎల్లామైసిన్' సృష్టికర్త

కొందరు మిత్రులు వారానికొకసారి మద్రాసు లోని మైలాపూర్ కపాలేశ్వరస్వామి ఆలయ పుష్కరిణి మెట్లమీద చేరి కబుర్లాడుకునేవారు. అందులో డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు, ప్రసిద్ధ చిత్రకారుడు చేమకూర సత్యనారాయణ, ప్రముఖ భాషాభిమాని తిరుమల రామచంద్ర, మాడభూసి వెంకటాచారి మొదలైనవారుండేవారు. రకరకాల అంశాలమీద ఇష్టాగోష్టులు నడిచేవి. ఎల్లాప్రగడ మాత్రం ఎప్పుడు సర్పగంధిని గురించి, అడ్డసరం గురించి, వాటి విశేష ఔషధ గుణాల గురించి తెగ మాట్లాడేవారు. 'నాకెవరైనా పదివేలు పెట్టుబడి పెడితే 'సర్పగంధి'తో అద్భుతాలు చేసి చూపిస్తా' అంటుండేవారు. ప్రతిసారీ ఈ ప్రస్తావన ఇలాగే సాగేది.

ఒకరోజు అందరూ కూర్చొని ఉండగా పెద్ద వర్షం కురిసింది. అందరూ పుష్కరిణి మెట్ల మీంచి పరుగెత్తి చుట్టుపక్కల దుకాణాల చూరుల క్రింద తలదాచుకున్నారు. డాక్టర్ ఎల్లాప్రగడ ఆంగ్లంలో తన సహజ ధోరణిలో సర్పగంధి గుణగణాల మీద ఉపన్యాసం దంచేస్తున్నాడు. అందరితోబాటు ఓ విదేశీయుడు ఆసక్తిగా వింటున్నాడు. అంతావిని, ఆ విదేశీయుడు తనని తాను పరిచయం చేసుకున్నాడు. అతనొక అమెరికన్ మందుల సంస్థ ప్రతినిధి. 'డాక్టర్! ఇందాకట్నించి నీ మాటలు వింటున్నాను. నీ మాటల్ని నిజంగా నిరూపించుకోగలవా?' అనడిగాడు. దానికి ఎల్లాప్రగడ 'ఓ తప్పకుండా! పదివేల రూపాయలు, ఆరు నెలల గడువు ఇప్పించండి. నేను చెయ్యకపోతే తిరిగి ఇండియా పంపెయ్యండి!' అన్నాడు ఉద్వేగంతో. ఆ విదేశీయుడు డాక్టర్ భుజం తట్టి, 'నేను రేపు అమెరికా వెళ్తున్నాను. మా డైరెక్టర్లతో మాట్లాడి, నిన్ను రెండు నెలల్లో అక్కడికి రప్పించే ప్రయత్నం చేస్తానం'టూ, చిరునామా, ఇతర వివరాలు తీసుకున్నాను. వాన వెలిసిన తర్వాత ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

సరిగ్గా ఆరు నెలల తర్వాత లేడర్లే సంస్థ నుంచి జాబు వచ్చింది. ఢిల్లీలోని వారి ఆఫీసు ద్వారా డాక్టర్ ఎల్లాప్రగడ ప్రయాణానికి ఏర్పాట్లన్నీ చేశారు. మిత్రులంతా ఆనందించారు, గర్వించారు, అభినందించారు. అమెరికాలో ఎన్నో మొండి రోగాలకు మందులు తయారుచేశారు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు.

ఆయన పట్ల గౌరవంతో ఒక మందుకు 'ఎల్లామైసిన్' అని పేరు పెట్టారు. 1995 ఆయన శతజయంతి సంవత్సర సందర్భంగా లేడర్లే ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. శ్రీ ఎల్లాప్రగడ సుబ్బారావు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో అతి సామాన్య కుటుంబంలో జన్మించారు. మద్రాసులోని హిందూ హైస్కూల్లో మెట్రిక్యులేషన్‌ని మూడవ ప్రయత్నంలో గట్టెక్కారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో ఇంటర్మీడియట్ పూర్తిచేసి, అక్కడే మెడిసన్‌లో చేరారు. ఆఖరి సంవత్సరంలలో ఉండగా విదేశీ వస్తు బహిష్కరణ, ఖాదీ వస్త్రధారణ గురించి గాంధీ ఇచ్చిన పిలుపు విన్పించింది. ప్రాక్టికల్ పరీక్ష సందర్భంగా ఆపరేషన్ చేసేటప్పుడు పూర్తిగా ఖద్దరు దుస్తులు, టోపీ ధరించారు. నాటి ఆచార్యుడు ఎమ్.సి. బ్రాడ్‌పీల్డ్‌కి ఆ చర్య అసలు నచ్చలేదు. అన్నీ సవ్యంగా వ్రాసినా, చేసినా సుబ్బారావు గారికి ఎం.బి.బి.యస్. డిగ్రీకి బదులు ఒక మెట్టు తగ్గించి ఎల్.ఎమ్.ఎస్. పట్టా ఇచ్చాడు. తర్వాత మద్రాసులోనే డాక్టర్ ఆచంట లక్ష్మీపతి ఆయుర్వేద కళాశాలలో, ఆతర్వాత మద్రాసు కార్పొరేట్ ఆయుర్వేద ఆస్పత్రిలో చేరారు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు.

– శ్రీ భారతీయ మార్గము

# మోక్షానికి మార్గం సేవ

భారతదేశంలో పర్యటిస్తూ స్వామి వివేకానంద దక్షిణదేశంలోని రామనాథపురం రాజ్యంలోని మధురై వెళ్లారు. ఈ నగరం ప్రస్తుతం తమిళనాడులో ఉంది. అక్కడ స్వామీజీకి రాజా భాస్కరసేతుపతితో పరిచయం అయింది. రాజు గొప్ప విద్వాంసుడు. స్వామీజీతో సంభాషించిన మీదట ఆయన ఎంతో ప్రభావితుడై స్వామీకీజి శిష్యుడైనాడు.

రాజా సేతుపతి ఒకనాడు స్వామీజీని ఇలా ప్రశ్నించాడు 'స్వామీజీ! మీరు విరాగులు. సంసార విముఖులు. అయినా దేశంలోని జనసామాన్యం యొక్క స్థితిని గురించి ఆలోచిస్తున్నారు, వ్యధ చెందుతున్నారు. వారి ఉన్నతి కోసం విద్యావాప్తి జరగాలని, వ్యవసాయాభివృద్ధి చెందాలనీ ఉత్సాహంతో చర్చలు చేస్తున్నారు ఎందువల్ల?'

స్వామీజీ చెప్పారు "సన్యాసియైన వాడికి మోక్షమే లక్ష్యంగా ఉంటుంది. నిజమే కాని, నా గురువులు నన్ను ఆదేశించారు. భారతదేశ ప్రజల ఉన్నతికై ప్రయత్నించటం కూడా మోక్షప్రాప్తికి ఒక పవిత్ర సాధనమే అవుతుంది' అని చెప్పారు. 'త్యాగము, సేవ అనేవి మన దేశంలో జాతీయ గుణాలు.' రాజు ఇది విని సర్వజన హితచింతకుడైన ఆ సన్యాసికి శ్రద్ధాభక్తులతో నతమస్తకుడైనాడు.






# సంధ్యావందనం శ్రీనివాసరావుగారు

అనంతపురం జిల్లా పెనుగొండ లో 21-8-1918 లో జన్మించిన ఒక మహా సంగీత విద్వాంసుని గురించి తెలిసినవారు, వారి సంగీతం విన్నవారు మన రాష్ట్రంలో బహు కొద్దిమందే. ఆయనకి దక్షిణ దేశంలో ఎంతో మంది అభిమానులున్నారు. ఆయనే... మన తెలుగువారు గర్వించదగిన 'సంగీత కళారత్న', 'సంగీత కళాచార్య' సంధ్యావందనం శ్రీనివాసరావు గారు.

ఏయుతులు మహారాజపురం విశ్వనాథ అయ్యర్, టైగర్ వరదాచారి, ద్వారం వెంకటస్వామి నాయుడు, మైసూర్ వాసుదేవాచారి, పొన్నయ్యపిళ్లై వంటి దజనుకు పైగా మహావిద్వాంసుల శిష్యరికంలో రూపుదిద్దుకున్న టాప్ గ్రేడ్ శాస్త్రీయ సంగీత నిధి ఆయన!

నేను రేడియోలో పనిచేయడంచేత, 'సంగీత శిక్షణ' కార్యక్రమంలో విద్యార్థిగా వారి వద్ద బేగడ రాగంలో 'లోకావన చతుర', శంకరాభరణ రాగంలో 'సుందరేశ్వ రాయ' వంటి కృతులు నేర్చుకొనే అదృష్టం కల్గింది.

ఆయన ఎంత నిరాడంబరులంటే... ఖద్దరు చొక్కా, గ్లాస్కో పంచెతో, ఒక సంచీ బుజానికి తగిలించుకొని, వడి వడిగా అడుగులేస్తూ నడచివచ్చేవారు. రేడియో రికార్డింగ్ కాగానే, ఆయనను నా మోటర్ సైకిల్ మీద కూర్చొబెట్టుకుని, రైల్వేస్టేషన్‌లో దింపుతూ ఉండేవాణ్ణి. దారిలో సంగీతానికి సంబంధించిన ఎన్నో విషయాలు నాకు చెప్పేవారు.

ఆయనది గొప్ప పాఠాంతరం. ప్రత్యేకించి, దీక్షితులవారి కృతులపై సాధికారత గల విద్వాంసులు. మద్రాసు, బెజవాడ రేడియో కేంద్రాలలో సంగీత ప్రయోక్తగా పనిచేసి, 'భక్తి రంజని' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు! 'వాద్య బృంద' కార్యక్రమం కోసం నిలయ విద్వాంసులకు అసంఖ్యాకంగా పాఠాంతరం బోధించారాయన! బాలమురళీగారికి కూడా మార్గదర్శకులాయన!

ఆయన తన పన్నెండవ యేటనుండే పాడటం ప్రారంభించారట! ఎంతో క్రమశిక్షణ, నిజాయితీ గల విద్వాంసులాయన. అందుకు నిదర్శనంగా రెండు సంఘటనలు వివరిస్తాను.

సెంట్రల్ కర్నాటిక్ మ్యూజిక్ కాలేజ్, మద్రాసులో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రోజుల్లో ఒకసారి 'విద్వాన్ కోర్సు' విద్యార్థులకు ఆయన శంకరాభరణ రాగంలో 'స్వర రాగసుధ' కృతి చెప్తున్నారు. విద్యార్థులంతా శ్రద్ధగా నేర్చుకుంటుండగా, ఒక విద్యార్థిని మాత్రం పాఠం వినకుండా, క్లాస్ రూం కిటికీలో నుండి అవతలివేపు ప్రవహిస్తున్న అడయార్ నదిని చూస్తూ కూర్చొని ఉండటం గమనించిన శ్రీనివాసరావుగారు, 'ఎన్నమ్మా? వైయార్యూ నాట్ సింగింగ్?' అని అడిగారు.

ఆ విద్యార్థిని, 'నాకు ఆ కృతి మా అమ్మ నేర్పింది. మళ్లీ వేరే విధంగా నేర్చుకోవడం నాకిష్టం లేదు' అని పెడసరంగా సమాధానమిచ్చింది. ఆమె, ఒక ప్రఖ్యాత 'సంగీత విదుషి' కూతురు. వెంటనే రావుగారు, 'అయితే ఎందుకు నా సమయం వృధా చేస్తావు? ఇకనుండీ నీవు నా క్లాస్ కి రానక్కరలేదు. మీ అమ్మగారి దగ్గరే సంగీతం నేర్చుకో'మని చెప్పారు. ఆమె క్లాస్ వదలి వెడితేగానీ, పాఠం కొనసాగించలేదు.

టిటిడి ఆస్థాన విద్వాంసునిగా గౌరవం అందుకొని, ఎన్నో అన్నమయ్య కీర్తనలకు బాణీలు సమకూర్చారాయన. ఒకసారి బెజవాడ సంగీత కళాశాలలో ఆయన కచేరీకి హాజరయ్యాను నేను. ఆనాడు వారు, అంతకు ముందు నేను ఎన్నడూ వినని వినూత్న ప్రయోగం చేశారు. ప్రధానాంశంలో రాగమాలికా స్వరకల్పన చేస్తూ... దగ్గరి పోలికలు ఉన్న జంట రాగాలను వరుసగా తీసుకొని, అప్రతిహతంగా స్వరవిన్యాసం చేశారు. ఉదాహరణకు... వరుసగా దర్బారు, నాయకి... రీతిగౌళ, ఆనందభైరవి... ఈ విధంగా. ఆనాటి కచేరీ నావంటి విద్యార్థులకు ఒక పాఠంలా సాగింది.

వృద్ధాప్యంలో ఉన్న సంధ్యావందనంగారు ఒకరోజు మద్రాసు రాయపేట హాస్పిటల్‌లో రోగుల క్యూలో కనిపించారు ఒక మిత్రునికి! ఆయన ఆశ్చర్యపోయి, 'ఆరోగ్యం బాగలేదా?' అని అడిగారు. రావుగారు చెప్పిన సమాధానం విని, కళ్లనీళ్ల పర్యంతం అయ్యాడట మిత్రుడు. విషయం ఏమిటంటే, రావుగారంటే గిట్టనివారు కొందరు, ఆయనను ప్రిన్సిపాల్ పదవినుండి తప్పించేందుకై, ఆయనకు మతి స్థిమితం లేదని ప్రచారం చేశారట. అది తప్పని నిరూపించేందుకు, తన ఆరోగ్యస్థితి బాగుందని వైద్యుని వద్ద ధ్రువీకరణ పత్రానికై ఆయన అక్కడ క్యూలో ఉన్నారు!

అంత నిర్మలచిత్తులు ఆయన! తన కుమారుడు రేడియో ఆడిషన్‌లో విఫలం చెందితే, ఆ ఓటమి తనదిగా భావించి, కంటతడిపెట్టటం నేనెరుగుదును. నిజానికి ఆడిషన్ బోర్డ్ మెంబర్ అయిన ఆయన, తన కుమారుడికి సిఫారుసు చేసిఉంటే, సునాయాసంగా అతడు ఉత్తీర్ణుడు అయి ఉండేవాడు.

సాంప్రదాయ సంగీతానికి ప్రాణమిచ్చిన సుగుణ సంపన్నులు సంధ్యా వందనం శ్రీనివాసరావుగారు, 25-1-1994 న నాద్యైక్యం చెందారు. ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని -
చెన్నై



# తెలుగు విద్యకు వెలుగు పోసిన
# కె. నరకేసరి

నిజం చెప్పాలంటే ఇప్పటి తెలుగువారికన్నా, ఆనాటి తెలుగువారికే భాషాప్రియత్వం ఎక్కువ, దాతృత్వం ఎక్కువ! లేకపోతే మద్రాసులో తెలుగు ఇంతమాత్రమైనా ఉండేదికాదేమో!

ఆనాడు తమవారు శ్రమించి లక్షలార్జించి యిస్తే, యీనాడు కొందరు విలాస వంతమైన జీవితాన్ని గడుపుతూ, తెలుగు భాషాభ్యున్నతికి ఏవిధమైన కృషిని సలుపక పోగా, తెలుగు భాషనే పట్టనట్టుంటున్నారు. తెలుగులో మాట్లాడుకోరు, చదవరు.

తెలుగు దీపం పూర్తిగా కొడిగొట్టుకునిపోకుండా – పది రూపాయలకు విలువున్న ఆరోజుల్లో లక్ష రూపాయలను తెలుగు భాషాభివృద్ధి కోసం విరాళమిచ్చిన విలక్షణ, విశిష్టపురుషుడు కే.యన్. కేసరి. తెలుగు చరిత్రలో నిస్వార్థపరులు గానూ, నిరాడంబరమూర్తులుగానూ ఇద్దరు కేసరులను చెప్పుకోవాలి.

ఒకరు ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు గారు, ఇంకొకరు కేసరీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు కే.యన్. కేసరి యనబడు కోట నరసింహంగారూ! వీరిద్దరి చరిత్రలనూ తెలుగు భాషా చరిత్రలో సువర్ణాక్షఋములతో లిఖించాలి. కానీ ఎప్పటికైనా ఆ వరవడిలో ఎవరైనా తెలుగు నేతలుద్భవించగలరాయని అస్మదాదులం ఎదురుచూస్తూ – కీ॥శే॥ కే.ఎన్. కేసరి గారి సంక్షిప్త చరిత్ర నీదిగువ వివరిస్తున్నాం:

అది 1875 సం॥ము ఏప్రిల్ 26న ఒంగోలు సమీపమునున్న ఇనమన మెళూలరు గ్రామములోని వెలనాటి వైదిక బ్రాహ్మణ కుటుంబమున కట నరసింహం గారు జన్మించారు. వారి తల్లిదండ్రులు కులీన బ్రాహ్మణులే అయినప్పటికినీ కటిక దరిద్రం అనుభవిస్తుండేవారు. దీనికి తోడు రోకటిమీద పోటులా – నరసింహంగారు జన్మించిన 5 మాసాలకే వీరి తండ్రిగారు కలారా వ్యాధి సోకి దివంగతులైనారు. అప్పటికి వీరి పిత్రార్జితమైన ఆస్తి పదే పదణాలు – అంటే అరవై నయాపైసాలు!

ఇట్టి దుర్భర దుస్సహ పరిస్థితుల్లో, నరసింహంగారి మాతృమూర్తి దుఃఖాన్ని దిగమింగి, తనకు తెలిసిన కుట్టు పని విద్యతో నరసింహంగారిని సాకమొదలిడినారు. ఐదవ యేట ఆయన్ను వీధిబడి నిర్వహిస్తున్న పిచ్చయ్యశాస్త్రి గారికప్పగించారు. ఆయన విద్యార్థులచే కూరగాయలూ, కాయధాన్యములనూ తెప్పించుకోవడం, అలాటి వసతి లేని విద్యార్థులను బెత్తముతో చావగొట్టడం చేస్తూండేవారు. నరసింహంగారు ఆ చెత్తపు ధాటికి తట్టుకోలేక చదువుకు స్వస్థి చెప్పారు. తల్లికి ఇంటి పనుల్లోనే సహకరిస్తూ, సంపన్నులైన వారి పొలములకు వెళ్లి జొన్న, సజ్జ కంకులను తెచ్చి యివ్వడమేగాకుండా, తనకు అబ్బిన నైపుణ్యంతో మఱ్ఱిఆకులతో విస్తళ్లను కుట్టి విక్రయించేవారు. ఒకానొక సమయంలో వృక్షాన్ని అధిరోహించి ఆకులను కోస్తున్న సమయంలో వృక్షాన్ని అధిరోహించి ఆకులను కోస్తున్న సమయంలో కళ్లు తిరిగి ముచ్చెమటలు పోసాయి. దానితో ఆయన ఆ వృత్తిని మానుకుని పరిసరగ్రామాలలోని ఇంటింటా యాచించి భిక్షాటనంతో వచ్చిన మృష్టాన్నమునే భుజించేవారు. అలా మండుటెండల్లో యాచిక వృత్తిని సాగిస్తూ, తన కాళ్లలో గుచ్చుకున్న ముల్లులను కూడా లెక్కించకుండా, రక్తం చిందుతున్న పాదలతో వచ్చిన తనయుణ్ణి జూచి తల్లి హృదయం తల్లడిల్లిపోయింది.

ఆమె వేదననూ, శ్రమనూ చూడలేని నరసింహం గారు ధైర్యం చేసి పాదాచారియై కాలినడకన దారిమకాములు చేసుకొంటూ చెన్నపురి (మద్రాసు) చేరుకున్నారు. అప్పటికాయన వయసు పదే పది సంవత్సరాలు.

చెన్నపట్నం చేరిన కేసరి గారు కొత్వాలుచావడి సమీపంలోని రావిచెట్టు అగ్రహారంలో మకాము చేశారు. ఉత్తరాది నుంచి వచ్చిన బ్రాహ్మణులెందరో అక్కడే మకాం చేసి, మధూకరంతో జీవితయాత్రను చేయనారంభించారు. అక్కడే 'మధ్యాహ్నం పూట బ్రాహ్మణులకు అన్నదానం చేసే సత్రములు కూడా ఉండేవి. అలా అలా ఆయన ఒక పూట తింటూ, మరోపూట పస్తులుంటూ జీవితయాత్రను సాగించేవారు. ఒక్కొక్కప్పుడు ఆయనకు ఒంటిపూట భోజనం కారణంగా రాత్రుళ్లు నిద్రపట్టేది కాదు – దమ్మిడికో, ఏగాడికో జొన్నపేలాలు కొనుక్కుని తిని, ఇన్ని మంచినీళ్లు త్రాగేవారట. తిండయితే ఏలానో గడిచిపోతుంది, మరి భవిష్యత్జీవితానికి కావాల్సిన చదువు ప్రశ్నార్థకమైంది. ఆనాడు బందరువీధిలో శ్రీరామానుజాచార్యులు గారు వీధిబడి నిర్వహించేవారు. ఆయన అనుగ్రహాన్ని పొంది, కేసరిగారు తెలుగు భాషను అనాయాసంగా అభ్యసించ కలిగారు. మింట్ స్ట్రీట్‌లోని శ్రీ శివశంకర పాండ్యన్ గారిని ఆశ్రయించి, స్కాలర్‌షిప్‌ను కూడా సంపాదించి, ఆయన వీధిబడిలో ఆంగ్లవిద్యను అభ్యసించేవారు. ఇక్కడ శివశంకర్ పాండ్యన్ గారి వద్ద ఇద్దరు నరసింహంలు విద్యార్జనం చేస్తూండేవారు. ఆయన కేసరిని పిలిచి ఈరోజునుంచీ నీ పేరు నరసింహం కాదు ఆ అర్థం వచ్చే కే.ఎన్. కేసరిగా పిలుస్తాను అన్నారు. అంతే ఆనాటినుంచీ ఆయన పేరు కె.యన్.కేసరిగా మారిపోయింది.

అలా అలా ఆయనకు తిండికీ, విద్యకు లోటు లేకుండా జరిగిపోయింది. ఇహః గుడ్డాగిడ్డలకు వైశ్య శ్రేష్టుల నాశ్రయించి నాలుగణాల చొప్పున చందాలు వసూలు చేసుకొంటూ 'పబ్బాన్ని' గడుపుకుంటున్నారు. ఇలాటి పరిస్థితుల్లోనే ఓ చోద్యం జరిగింది.

కేసరిగారికి నాలుగణాలు చందాలిచ్చే వారిలో జగ్గయ్య పేటకు చెందిన నరసింహులు శ్రేష్టిగారనే వారుండేవారు. ఒకనాడు కేసరిగారికి కొన్ని పుస్తకాలు కొనుక్కోవలసిన అవసరం ఏర్పడింది. నరసింహ చెట్టిగారిని సమీపించి, 'అయ్యా, మామూలుగా యిచ్చే పావలాకు తోడుగా మరోపావలా అదనంగా యివ్వమని అభ్యర్థించారు. చెట్టిగారు యిచ్చేట్టుగానే కనిపించి దగ్గరకు రమ్మని – 'అరే – నీకు మామూలు దండగ్గా యిచ్చే పావలానే గాకుండా, మరో పావలా కూడా కలిపి యివ్వాలా' అంటూ చెంప చెడేల్మనిపించాడు. ఆ దెబ్బకు ఆయన ముఖం తిరిగి సోలి క్రింద పడిపోయారు. చెట్టిగారి అర్థాంగి యీదుష్కృత్యమును చూచి, విసుక్కుని, కేసరి గారిపట్ల దయార్ద్ర హృదయంకలదియూ, కొంచెంసేపు సేదతీర్చి, మంచినీళ్లిచ్చి, స్థిమితుడైన తరువాత ఓ రూపాయినిచ్చి – 'నీకు కావాల్సిన పుస్తకాలు కొనుక్కోబాబూ' అంటూ పంపించి వేసింది.

ఇదేనేమో జీవితంలో అతడెన్నో దెబ్బలు తిన్నాడురా అంటారు. కానీ ఆయన నిజానికే దెబ్బలు తిన్నారు. తిన్నారు గనుకనే తనవారినీ, పెద్దవారినీ దెబ్బలు తినడానికిచ్చగించలేదు. ఆయన్నెవరైనా ఇంద్రుడనీ, చంద్రుడనీ పొగిడినా సమ్మతించలేదు. కానీ ఈ పొగడ్తల వెనుక వున్న సత్యాన్ని ఆనాగే గ్రహించారు. డబ్బున్న ప్రతీ వారిని గుణోపేతుడు గాకున్ననూ విద్యావంతునిగానూ, వినయశీలి గానూ, ప్రాజ్ఞతగల విజ్ఞునిగానూ, ఉదార స్వభావుని గానూ పొగడడం లోక సహజం. ఆ సహజ విలువలెట్టివో కేసరిగారు ఆనాడే గ్రహించారు, గుర్తించారు. ప్రపంచాన్ని చూచి పకాల్ని నవ్వుకున్నారు. తనలాటి వాటికీ తావివ్వకూడదని ఆనాడే భావించారు. అందుకే ఆయన విశ్వమంతటి వారయ్యారు, ఆస్తులను విస్తరించారు, ఆశ్రితులనూ, ఆర్తులనూ ఆదుకున్నారు. విద్యయొక్క విలువల్ని గుర్తించారు, విద్యాలయాల్ని నెలకొల్పి పోషించారు.

మరల ఇక్కడ అసలు (బాల్యానికి) విషయానికి వద్దాం. అవమాన పరంపర లనూ, మానసిక వ్యథకూ గురియైన కేసరి గారు – డబ్బులేనివాడు ఎందుకూ కొరగాడనీ, అద్దానిని అర్జించడం అత్యంత ప్రధానమనీ భావించారు. ఆచారప్పన్ వీధిలోనే నెలకు పన్నెండు అణాల అద్దెతో ఓ ఇల్లును తీసుకుని, తల్లి గారితో ఉంటూండేవారు. ఆయన పిల్లలకు చదువు చెబుతూ నెలకూ ఐదు రూపాయలు సంపాదించేవారు, ఆ తల్లి వైశ్యుల ఇంట పనిచేసి ఇంకో అయిదు రూపాయలు సంపాదిస్తూండేది. ఈలా వచ్చే పదిరూపాయలతోబాట ఆయమ్మ మరో ఇద్దరు తెలుగు విద్యార్థులకు వండిపెడుతూ కాలక్షేపం చేస్తున్నారు. మరల విధి వక్రించింది. వారి తల్లి అస్వస్థతకు గురియై, ఆయన్ను విడిచి శాశ్వతంగా వెళ్లిపోయింది. కేసరిగారిని మాతృవియోగం బాగా కుదిపివేసింది. అయితే ఆయన ఆలనాపాలనలు చూచి, తల్లిలా చూచే మరో తల్లి జొన్నలగడ్డ నరసమ్మ గారు కేసరి గారి కుద్బాదను చూస్తూండేది. ఆమె కూడా తెలుగు విద్యార్థులకు వంట చేసిపెట్టే పూటకూళ్లమ్మే! ఆమెకు కేసరిగారు సాయితీగా పనులు చేస్తూండేవారు. దైవం అప్పుడప్పుడు నిర్దాక్షిణ్యమూర్తి గాకుండా కేసరిగారిని కనిపెట్టుకుని చూస్తున్నారనే చెప్పాలి. ఆరోజుల్లో నిరక్షరాశ్యులైన కొందరు చిన్నచిన్న ఉద్యోగులు తమ బంధువులకు ఉత్తరాలు వ్రాయించుకొనేవారు. కార్డు వ్రాసిన అర్ధణా, కవరు వ్రాసిన అణా యిస్తూండేవారు. తీరిక సమయాల్లో వైశ్యులబిడ్డలకు చదువులు చెబుతూండేవారు. ఆ వచ్చే ఆదాయంలో కొంత నరసమ్మ గారికి భోజనం ఖర్చులకై యిస్తూండేవారు. అలా అలా జీవనయానాన్ని సాగిస్తూన్నప్పుడే కేసరిగారికి కనకమ్మయనే కన్యాకామణితో వివాహం జరిగింది. ఆమె పల్లెటూరు పడుచు, ఛాందసురాలు, చదువుసంజెలసలేవేల. ఇలా ఇటు సంసారంలోనూ, అటు సంపాదనలోనూ సారహీనమైన జీవితాన్ని గడుపుతూ మరో మార్పు కోసం ప్లీడరు గుమాస్తా కూడా చేశారు. గాడిదలా ఫైళ్లు మూయడం తప్పితే జీతబత్తాలు రాలేదు. ఏదైనా స్థిరమైన వృత్తిని చేసి స్థిరజీవనానికి మార్గం ఏర్పరచుకోవాలనుకున్నారు. ఆయన దృష్టి ఆయుర్వేదం మీదకు మళ్లింది. ఆ వైద్యవిద్యను బోధించే పాఠశాలలంతగా లేకపోవడంతో పేరెన్నికగన్న భిషగ్రత్న మహాదేవశాస్త్రిగారి వద్ద కొంత తర్ఫీదు పొందారు. వైద్యగ్రంథాలను పఠించారు. వైద్యరహస్యాలను, ఔషధ, తయారీలనూ తెలుసుకున్నారు. కొంతకాలం కన్యకాపరమేశ్వరీ దేవస్థానం వారు నెలకొల్పిన ఆయుర్వేద వైద్యశాలలో పండితుడు గోపాలాచార్యులు వారిత కలిసి పనిచేశారు. ఆ సంస్థ వారిచ్చు స్వల్పవేతనం, గోపాలాచార్యులతో వచ్చిన అభిప్రాయభేదములు కేసరిగాని సర్వస్వతంత్ర ప్రవృత్తి పరునిగా తీర్చిదిద్దాయి.

నారాయణ మొదలి వీధిలో నెలకూ ఒక రూపాయి ఆరణాల అద్దెపై ఒక భవనం తీసుకుని గోడపై మసి బొగ్గతోనే ‘శ్రీ కేసరీ కుటీరం’ – ఆయుర్వేద ఔషధశాల’ అని వ్రాసి – ‘తాంబూలరంజని’ అనే పరిమళగుళికల్ని తయారుచేశారు. ‘ఆంధ్ర ప్రకావిక’ అనే దినపత్రికలో కొత్తరకమైన పబ్లిసిటీ నిచ్చి – మందులలో ఓ సంచలనాన్ని తెచ్చారు. అక్కణ్ణుంచి స్త్రీల రుగ్మతలనూ, సత్వరసంక్షేమాలనూ కాంక్షించి ‘లోధ్ర’, అమృత, అర్క’ వంటి పేటెంట్ ఔషధాలను తయారించి విస్తారంగా మార్కెట్ చేశారు. వచ్చిన లాభాలతో ఎగ్మూర్‌లో ఓ స్వంత భవనాన్ని ఏర్పరచుకున్నారు. ఓ మార్కెట్, ఓ ముద్రణాలయం, ‘గృహలక్ష్మి’ అనే ఓ పత్రికనూ కూడా ప్రారంభించారు. వారి గృహలక్ష్మిపై వారికపారమైన ప్రేమ. కానీ ఆమె సంతానభాగ్యం నోచుకోని కారణంగా ఆమె నెందరినో వైద్యులకు చూపించారు, తీర్థయాత్రుల్ను సతీసమేతంగా చేశారు. ఆమె అస్వస్థురాలయింది. ఆమెను ఇంట్లో చూచే దిక్కు లేకపోయింది. అప్పుడాయన తీవ్రాలోచన చేసి, ‘మాధవమ్మ’ అనే కేరళ కన్యను వివాహం చేసు కున్నారు. అప్పటికి ఆయనకు 43 సంవత్సరములు. మాధవమ్మ తండ్రి న్యాయవాది కావడంతో ఆమెలో విద్యతోబాటు వినయం, సంస్కారం మూర్తీభవించి ఉన్నాయి. ఆమెకు వైద్యవిజ్ఞానం కరతలామలకం కావడం వలన కేసరిగాని జీవితం మరింత ఉన్నత శ్రేణికి చేరుకుంది. ఆయనకు మాధవమ్మ కారణంగా ఇరువురు కుమార్తెలు కలిగారు. శారదాదేవి, వసంతకుమారి వారి నామధేయములు. శారదాదేవికి బాలకృష్ణ నెడుంగాడితో వివాహం జరిగింది. వారికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కల్గిరి. కేసరిగారు గతించిన తరువాత కేసరి గారి మనమడూ శారదాదేవి పెద్దకుమారుడైన శ్రీ రాధాకృష్ణన్ గారు కేసరిగారు నెలకొల్పిన విద్యాలయములు, వైద్యాలయముల సర్వతోముఖాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. వారికి సహకారిగా వారి పినతాతగారు డా॥ ఎస్. శేషగారిరావు కూడా అహర్నిశలూ శ్రమించి సంస్థల ప్రగతిని ఓ కంట కనిపెడ్తున్నారు. ఈనాటికీ కేసరీ విద్యాసంస్థలు చేస్తున్న మహోన్నత కృషి ఎంతో గణనీయమైనది. ●

# ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

**ప్రముఖాంధ్ర గత 26 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? ‘వేలు’గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.**

**అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతుంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ ‘రూక’నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోస్తాం. ‘ప్రముఖాంధ్ర’ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న దబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.**

**రూ. 251, 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

**ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :**

| | | |
|---|---|---|
| Account Name | : | PRAMUKHANDHRA |
| Account No | : | 20011102592 |
| Bank | : | BANK OF MAHARASTRA, T.NAGAR |
| IFSC Code | : | MAHB 0000450 |

**ప్రముఖాంధ్ర**
**64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.**
**మొబైల్ : 98400 48941**



# హైటెక్ ఆధ్యాత్మికమై పోతూంది! నెట్‌లో మంత్రాలు, మానిటర్‌లో చిత్రాలు! ఆధ్యాత్మికలో కొత్త పుంతలు

తీరికలేని ఈ ప్రపంచంలో తీరిక కల్పించుకుని పూజలూ, పునస్కారాల్ను చేసే అవకాశం లేక, చూచే అవకాశం అంతకన్నా లేకున్నా ఈ తరం వారు తమ తమ లాప్‌టాప్‌ల్లోనే (మినీ కంప్యూటర్లలో) తమ ఇష్ట దేవుళ్లనూ, దేవతలనూ చూస్తున్నారు; పూజలు చూస్తున్నారు, పునస్కారాలు చూస్తున్నారు. కొంతమంది స్త్రీలు కంప్యూటర్లను దగ్గరుంచుకుని వరలక్ష్మీ వ్రతం వంటి పూజలు చూచి చేస్తున్నారు. పురోహితులూ సరంజామా లేని ఈ పని కొంత ఊరట కలుగచేస్తున్నది. నగరాల్లో కల పురోహితుల్ని భరించే స్తోమతు సత్తా మధ్యతరగతి వ్యక్తికి లేకుండా ఉంది. సత్యనారాయణ వ్రతం చేసుకోవాలన్నా, గణపతి హోమం చేసుకోవాలన్నా – కనీసం రూ. 3000 నుంచీ రూ. 5000ల వరకూ, ఆ పైగా కూడా అడుగుతున్నారు. పైగా చెప్పిన సమయాలకు రారని వాపోతూ ఓ పెద్ద మనిషి వచ్చి మొరపెట్టాడు.

ఇక పల్లెలూ, గ్రామాల్లో అంటారా – పురోహితులూ, పూజల్చేసేవారూ కరువయ్యారు. చావో, పెళ్లో వస్తే – బ్రతికున్న వాళ్లకు 'చావు' అవుతున్నది. ఇప్పుడు ప్రతీ పల్లెవారు, పట్నం వారు, నగరం వారి చంకల్లో అన్నీ లాప్‌టాప్‌లే. ఈ మినీ కంప్యూటర్ల ద్వారా కావాల్సిన దేవుళ్లను, వారి వ్రతపూజా విధానాలనూ 'ఫీడ్' చేసుకొనే అవకాశం ఎంతెంతగానో ఉంది. చిన్న పిల్లలు సహితమూ చేసేస్తున్నారు. ఇంతవరకూ సినిమాలనూ, సినిమా పాటలనూ, నచ్చిన సినిమా దృశ్యాల్ను 'ఫీడ్' చేసుకునేవారు. దేవతా పూజల్ని, పూజా విధానాల్నీ సులభంగా ఫీడ్ చేసుకుంటున్నారు. ఆమధ్య ఒకాయన వినాయకవ్రతాన్ని, సత్యనారాయణ పూజనూ తమ లాప్‌టాప్ ద్వారానే చేశానని చెప్పాడు. పెళ్లీ, చావులు రెండూ కష్టంగానే ఉన్నాయి. రూ. 25,000లు ఇస్తేగానీ పురోహితులు రామంటున్నారు. దీనిని కూడా 'లాప్‌టాప్', ఓ మార్గం చూపిస్తే బాగుంటుందన్నాడాయన.

కొత్త తరంలో పౌరోహిత్యానికి వచ్చేవారు తక్కువ. వారే, పెళ్ళిళ్లూ, పేరంటాలూ జరిపించి, చావులకు వెళ్లవలసి వస్తూన్నది. ఇలాటప్పుడు 'కంప్యూటరాయ నమః' మార్గం చూపించమ్మా' అంటూ దణ్ణం పెడ్తూంటే నవ్వు వచ్చింది. ఇది నవ్వులాట కాదండోయ్ – ఇటు కల్యాణమండపం, అటు పురోహితుల్ని, మరోప్రక్క వంటవాళ్ల వెంట పడాలంటే కష్టంగా ఉంది. ఈమధ్య మా మనుమని ఉపనయనానికి వంట వాళ్లు దొరక్క, కాటరింగుకు ఆర్డర్ ఇచ్చేశాం. ఇదే సౌకర్యంగా ఉంది. ఇటు పెళ్లిలోనూ, అటు వంటగదిలోనూ పర్యవేక్షణం చేసే 'బాధ' తప్పింది. ఇలా ముహూర్తం కాగానే, అలా భోజనాలకు కూర్చోవచ్చు. **వివాహభోజనంబు వింతైన వంటకంబు అలా – కాటరింగ్ భోజనంబు కొంపకెంతో సౌకర్యంబు** అంటూ కాలుమీద కాలువేసి కూర్చోవచ్చు. మడమ తిరక్కుండా పనులన్నీ పసందుగా జరిగిపోతున్నాయ్. నీళ్ల లారీ తెప్పించుకోవడం, గ్లాసులు అద్దెకు తెచ్చుకునే బాధ లేకుండా 200, 250 మిల్లీల్లో నీళ్లబాటిళ్లను కాటరింగువాళ్లు సప్లై చేస్తున్నారంటూ, పాత రూపాయంత నోరు పెట్టి మందహాసంగా చెప్పాడాయన.

పెళ్లిమంత్రాలూ, ఉపనయన మంత్రాలు కూడా సి.డి. డి.వి.డి.లుగా వస్తే, ఇంకా ఎంత బాగుంటుందో. లాప్‌టాప్‌లో దాన్ని బంధించి, దాన్ని చూస్తూ పెళ్లిని జరిపించేయవచ్చు. ఏలాగూ మంగళవాయిద్యాలు రికార్డులుగా వచ్చాయ్. ఇది కూడా వస్తే బాగుంటుంది కదా ఒసేవ్ – అన్నాడు బలరామయ్య!

కంప్యూటరమ్మా – నీవే మనసుతో కాలుపెట్టావోగానీ – అంతా 'రోబో' చేస్తున్నట్టుగానే జరిగిపోతుంది తల్లీ అన్నాడా అర్చకుడు.

గాయత్రీ మంత్రంతో స్వామి రారా, చెంతకురారా' అంటూ ఉననయనమూ చేయవచ్చు. ●

# వేయి నవలలు రచించి, లక్షలాది ప్రజల్ని పఠితలుగా తయారుచేసిన ఖ్యాతి కొవ్వలి లక్ష్మీనరసింహారావుదే!

కొవ్వలి అనే 3 అక్షరాలూ ఆయన వ్రాసిన వేయి నవలూ ముక్కోటి ఆంధ్రులకూ ఎరుకే! అసలు నవలా పఠనపై దృష్టిని పెట్టించినవాడు కొవ్వలే! కొత్త పెళ్లికొడుకూ, కొత్త పెళ్లికూతురూ తొలిగా చదివేది కొవ్వలి నవలలే! ఆ తరువాతనే జంపన మానాపురం–తదితర రచయితలు వచ్చారు. ఆయన నవలలు ఎక్కువగా రైళ్లలోనే అమ్ముడయ్యేవి. ప్రతీ ప్రయాణీకుడూ, రైలు టిక్కెట్టుతో బాటు కొవ్వలి నవలను కూడా చేబట్టేవారు. ఇది 1940–50ల్లో విషయం. ఆ తరువాత ఆయన మద్రాసు వచ్చేసి సినిమా రచనపై దృష్టి నిలిపారు. డి.యల్.నారాయణ తీసిన 'శాంతి' చిత్రానికి ఆయనే రచన అనుకుంటాను. ఆయన ఆంధ్రపత్రిక డైలీలో సీరియల్‌గా వ్రాసిన 'సిపాయి కూతురు' నవలను డి.యల్. సినిమాగా తీస్తూ – కైకాల సత్యనారాయణను జమున ప్రక్కన హీరోగా చేశారు.



కొవ్వలి నవలలు వ్రాసేటప్పుడు ప్రచురణకర్తలకు షరతులు విధించేవాడట – పాఠకులకు అందుబాటులో ఉండే రేటు పెట్టమని చెప్పేవాడట. ఆ రోజుల్లో ఆయన నవలల్ని అర్ధరూపాయి పెట్టి అమ్మేవారు. గొల్లపూడి వీరాస్వామి తొలి నవల ప్రచురించిన గుర్తు. అక్కణ్నుంచి ప్రచురణకర్తలందరూ కొవ్వలి నవలల్ని కోరేవారు. కారణం పాఠకులు డిమాండుడేది. ఇంతి చామంతి పూబంతీ నవల బాగా అమ్ముడుపోయిందనుకుంటాను. అసలు అమ్మని కొవ్వలి నవల చరిత్రలోనే లేదు. ఆయన మద్రాసు రావడమే పొరపాటు చేశారు. ఆంధ్రలో అందునా రాజమండ్రిలో ఉంటే ఇంకా ఎక్కువ నవలలు వచ్చేవి. ఆయన స్థానాన్ని జంపన, మానాపురం, ఓ రకంగా, కొద్దిగా నేనూ ఆ రైలు సాహిత్యం నవలలు వ్రాశానుగానీ 'సవతి తల్లి' అనే పేరున వ్రాయడం దెబ్బకొట్టింది.

ఆయన మద్రాసులో ఉన్నప్పుడు తంబయ్యారెడ్డి స్ట్రీటులో ఉన్న నా ప్రెస్ మీదుగానే రోజూ వెళ్లేవారు. నోట్లో ఓ కిళ్లీ వుండేది. ఓనాడు ప్రెస్‌కు వచ్చి ఓ నా నవల ప్రచురించకూడదా అని అడిగారు. ప్రచురిస్తానని ప్రచురించాను. అంటే ప్రచురింపబడిన వేయి నవలలో నేను ప్రచురించినదీ ఒకటుంది. పురాణ సుబ్రహ్మణ్యం కొవ్వలిని గురించి వ్రాస్తూ– గురజాడ అప్పారావు గారు వ్యావహారిక భాషోద్యమానికి నడుము కట్టి ఏనాడు 'కన్యాశుల్కం' నాటకం వ్రాశారోగానీ, కొవ్వలి సైనికునిలా ఆ ఉద్యమాన్ని బాగా హుషారుగా నడిపారన్నారు.ఆ కొవ్వలికి నా జోహారు. – **'గోటేటి'**

# హిందూ వివాహ వ్యవస్థ చాలా పవిత్రమైనది! - లవ్ లవ్ అనే కామ పిశాచులు గ్రహించవలసిన సమయమేతెంచినది!


**ఈ వ్యాసం వ్రాయడానికి ప్రధాన కారణం ప్రస్తుతం ఏ పత్రికలో చూచినా, ఎక్కడ చూచినా ప్రేమలూ, ప్రేమించుకోవడాలూ, ప్రేమించలేదని పైశాచికంగా చంపడమో జరుగుతూంది. దీనికంతటికీ కారణం యువత దారితప్పి వ్యవహరించడం. ముఖ్యంగా పాఠశాలల్లో ఎవరికి వారు నిర్ణయాలను తీసుకోవడం, ప్రేమించుకోవడం, ఆ వగరు కాస్తా తీరేసరికి విడిపోవడమో, కత్తులతో పొడవడమో, ఏసిడ్ పోసుకోవడమో, విడాకులు తీసుకోవడమో! ఇది పాశ్చాత్య విష సంస్కృతియనీ, మన దేశానికి సరిపడదనీ చెప్పడానికే ఈ వ్యాసం.**

భారతదేశంలో వివాహ విధానం వేదపరంగా తీర్చిదిద్దబడినది. 'తాళి' కట్టినప్పట్నుంచీ ప్రాణం విడిచేవరకూ విడదీయరాని పవిత్ర బంధమే వివాహం.

పెద్దలు కూర్చిన పవిత్ర బంధం వివాహం. దైవబలాన్ని కోరుతూ - ఇరువురికీ అగ్నిసాక్షిగా హోమ నిర్వహణంతో - ఆ దాంపత్యం కల కాలం నిలవాలని ఓ క్రతువుగా చేయడం ఒక్క భారతదేశంలోనే ఉంది.

**అర్థం భార్యామనుస్యః । భార్యాశ్రేష్ఠతమ సఖాః**
**భార్యామూలం త్రివర్ణస్య భార్యామూలం తరిష్యతః '**

- అన్నారు పెద్దలు. వివాహమైన తరువాత భార్య మధురమైన మంజులమైన భావన. జీవనంలో అర్థభాగం, సహజీవనంలో అర్థభాగం. సంసార పాలనలో అర్థభాగం. సంతాన సాధనంలో అర్థభాగం. అందుకే ఆదిదేవుడైన పరమశివుడు తన శరీరంలో అర్థభాగం సహధర్మచారిణి పార్వతికి అనుగ్రహించాడు. త్రివర్గాలైన ధర్మార్థకామాలనే వర్గ సాధనకు భార్యయే మూలం. ఆమె మూలంగానే పురుషుడు తరిస్తాడు. ఆమె కారణంగా అన్ని ధర్మకార్యాలకూ, యాగ యజ్ఞాలకు అర్హుడౌతాడు.



అందుకే ధర్మమూర్తియైన శ్రీరాముడు అనన్యాహీ మయాసీతా। భాస్కరస్య ప్రజాయుధా' అంటాడు అంటే సూర్యునిలో వెలుగు ఎవ్విధంగా వేఱుచేయబడ లేదో నానుండి సీత వేఱు కాదు. ఆమె తనకు అనన్య అంటాడు. అనన్య అనగా వేఱుచేయవీలుబడనిది.

అదే విషయం ధర్మరాజు యక్షుడు వేసిన పురుషునకు దైవమిచ్చిన స్నేహితుడెవరని అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ - భార్య, దైవ కృతా సఖాః' అంటాడు. భార్యే దేవుడు ప్రసాదించిన ఆజన్మాంత స్నేహిత భార్యేనంటాడు. అంటే తన జీవితంలో ప్రవేశించిన వధువుకు అంతటి విలువ, అంతటి స్థానం యిచ్చారు పూర్వులు.

అర్ధేన తస్యాం సానారీ విరోజు మస్రుజత్ ప్రభుః - విశ్వ నిర్మాణానికి దాంపత్యం మూలకారణం. ఆ దాంపత్యం సుస్థిరంగా ఉంటేనే సంసారమనే నౌక ఒడిదుడుకులు లేకుండా ఉంటుంది.

మనుధర్మం ప్రకారం వివాహం సాంప్రదాయబద్ధం. విడదీయరాని శాశ్వత బంధం. వివాహమైన దంపతులు తుది శ్వాస వరకూ ఎన్ని కష్టములకైననూ ఓర్చి కలిసి జీవించాలి. ఇది సనాతన మానవజాతి ధర్మము. ప్రతీ మానవునికీ జీవితమునందు వివాహము ముఖ్య అవసరమని, వివాహము లేనిదే జాతి మనుగడ ఆగిపోయే ప్రమాదముందని 'మనువు' సందేశమిచ్చారు. సృష్టి పెరగడానికి వివాహము మొదటి మెట్టు. మానవులు ఎదగడానికి రెండవ మెట్టు. పితృకార్యములు, ఋణములు తీర్చడానికి మూడవ మెట్టు. భార్యకు 'జాయ' అని మరో పేరు ఉందని 'మనువు' చెప్పారు.

**ఏతిర్భార్యాం సంప్రవిశ్వగర్భో భూతేయ జాయత్**
**జాయి యాస్తద్ధి జాయత్వం యదస్యాం జాయత్ పునః**

తన ఆత్మ సంధాన రూపంలో భార్య ద్వారా పుడుతుంది. కనుక ఆమెను రక్షించుకోవడం, ఆమెతో స్నేహంగా మెలగడం, ఆమెతో ఆత్మీయానుబంధాల్ని పెంచుకోవడం, తన సంతానాన్ని రక్షించుకోవడం అవుతుంది. భర్త తన ఆత్మను రక్షించుకోవడమే అని శృతి రమ్యాతిరమ్యమైన భాష్యం చెప్పింది. 'ఆత్మవస్తు కామాయ సతర్వం ప్రియం భవతి' అంటే అదే.

**సమ్రాజ్ఞీశ్వశుర్ భవ సమ్రాజ్ఞీ శ్వశాంభవీ ననాందరి సమ్రాజ్ఞే భవ సమ్రాజ్ఞే అధిదేవృఘు'**

పుట్టింటిని విడిచి మెట్టినిల్లు మెట్టబోయే ఇల్లాలికి అత్త వారింటి కుటుంబం మహారాణిలా స్వాగతం చెబుతుంది. ఆమె చేతనే కుటుంబ గౌరవం, వంశప్రతిష్ఠలు కలుగుతాయని ఆ కుటుంబాన్ని అన్ని విధాలా తీర్చిదిద్దవలసిన స్థానంలో సర్వ విధాలా ఆ కుటుంబానికి దీపమవుతుంది. తన ఉనికిచేత, సాహచర్యం చేత, సత్ప్రవర్తన చేత ఆ ఇంటిని తేజోవిరాజితమైన స్వర్గంగా చేస్తుంది. భార్యగా, కోడలిగా, వదినగా, భర్తను, అత్తమామలను, మరుదులను, మరదళ్లను ప్రేమానుబంధంతో క్రమశిక్షణతో కలుపుకుంటూ పోతూ కుటుంబ ఉన్నతికి పాటుపడవలసినది ఆమే! అటువంటి ఆ పవిత్రురాలైన కన్యను యిచ్చేటప్పుడు 'ధర్మేచ, అర్థేచ కామేచ నాతిచరామి' అని కన్యాదాత ప్రమాణం చేయిస్తాడు. నా కుమార్తెను ఎట్టి పరిస్థితులల్లోనూ నిరాదరించకుండా, ధర్మంలోనూ, అర్థం సంపాదించుకోడంలోనూ, కామాన్ని సాధించుకోవడంలోనూ కుమార్తెను దాటి వెళ్లనని మాట యివ్వు' అంటాడు. అంటే ఆమెను ధర్మపత్నిగా. ఉత్తమమైన ఇల్లాలుగా ఉన్నతమైన సంస్కారం, ఉజ్వలమైన సౌశీల్యం పాటించినప్పుడే కుటుంబానికీ సమాజానికీ శ్రేయస్సు కలుగుతుంది.

అందుకే పెద్దలు అన్నారు. 'యత్ర నార్యస్తు పూజ్యంతే - రమంతే తత్ర దేవతా' ఎక్కడ స్త్రీలు గౌరవింపబడుతూంటారో అక్కడ దేవతలు నడయాడతారు. కలకంఠి కన్నీరు కారిస్తే ఇంట సిరులుండవూ, చిరునవ్వులూ ఉండవు. భర్తలో సగం, ఆమెను సంతోషంతో పొందనిదే సంతానం కలుగదు. పురుషుని వ్యక్తిత్వం సంపూర్ణం కాదు. సంపూర్ణంకావాలంటే రెండో సగమిచ్చే భార్య జీవితంలోకి ప్రవేశించాలి. అప్పుడే అతడు పరిపూర్ణుడౌతాడని తైత్తరీయ బ్రాహ్మణం కూడా చెప్పింది. కుటుంబ వ్యవస్థలో ఆమె పదవి ఉన్నతమైనది. ఆ సాంప్రదాయం ఆత్మవిశ్వాసాన్నిచ్చే సాంప్రదాయం భారతీయులకీ ఉన్నది. భారతీయ వ్యవస్థలో 'స్త్రీ'ని శక్తిస్వరూపిణియన్నారు. ఇది గమనించకే కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయ్. ●

# మనం తరుచుగా వినే కొన్ని సంస్కృత వాక్యాలకి మూల శ్లోకాలు తెలుసుకోవాలని అనిపించడం సహజం కదా!

అలాంటి వాటిని కొన్నింటిని మీకోసం...
ముందుగా మనం తరుచుగా వినే మూల వాక్యాలు ఇవీ:
ధర్మో రక్షతి రక్షిత:



- **సత్య మేవ జయతే**
- **అహింసా పరమో2ధర్మ:**
- **ధనం మూలమిదం జగత్**
- **జననీ జన్మ భూమిశ్చ**
- **స్వర్గాదపి గరీయసి**
- **కృషితో నాస్తి దుర్భిక్షమ్**
- **బ్రాహ్మణానా మనేకత్వం**
- **యథా రాజా తథా ప్రజా**
- **పుస్తకం వనితా విత్తం**
- **పర హస్తం గతం గత:**
- **శత శ్లోకేన పండిత:**
- **శతం విహాయ భోక్తవ్యం**
- **అతి సర్వత్ర వర్జయేత్**
- **బుద్ధి: కర్మానుసారిణీ**
- **వినాశ కాలే విపరీత బుద్ధి:**
- **భార్యా రూప వతీ శత్రు:**
- **స్త్రీ బుద్ధి: ప్రళయాంతక:**
- **వృద్ధ నారీ పతి వ్రతా**
- **అతి వినయం ధూర్త లక్షణమ్**
- **ఆలస్యం అమృతం విషమ్**
- **దండం దశ గుణం భవేత్**

– ఇవీ మన చెవిని పడుతూ ఉండే మూల వాక్యాలు. కదా?
ఇప్పుడు వీటి పూర్తి పాఠాలు చూద్దామా?

**ధర్మ ఏవో హతో హంతి**
**"ధర్మో రక్షతి రక్షిత:"**
**తస్మా ధర్మో న హంతవ్యో**
**మానో ధర్మో హ్రతోవ్రధీత్**

ధర్మాన్ని మనం ధ్వంసం చేస్తే, అది మనల్ని ధ్వంసం చేస్తుంది. దానిని మనం రక్షిస్తే, అది మనల్ని రక్షిస్తుంది. అందు చేత ధర్మాన్ని నాశనం చేయ కూడదు. ఎవరికి వారే తమంత తాముగా నశించి పోవాలని కోరుకోరు కదా!

**సత్యమేవ జయతే నా2నృతం**
**సత్యేన పంథా వితతో దేవయాన:**
**యేనా క్రమం తృషయో హ్యాప్త కామా**
**యత్ర త త్సత్యస్య పరమం నిధానమ్**

సత్యమే జయిస్తుంది. అసత్యం కాదు. సత్యం వలన దేవతల మార్గం కనిపిస్తుంది. సత్యం వలన మహర్షులు కోరికలు లేని వారై పరమేశ్వరుని పొందగలుగుతున్నారు. ఈశ్వరుడు సత్య స్వరూపుడు.

**అహింసా పరమో ధర్మ:**
**తథా2 హింసా పరం తప:**
**అహింసా పరమంజ్ఞానం**
**అహింసా పరమార్జనమ్**

అహింస గొప్ప ధర్మం. గొప్ప తపం. మంచి జ్ఞానం. గొప్ప సాధన

**ధనమార్జాయ కాకుత్స !**
**ధన మూల మిదం జగత్**
**అంతరం నాభి జానామి**
**నిర్ధనస్య మృతస్య చ**

ఓ రామా ! ధనాన్ని సంపాదించాలి. ఎందు కంటే ధనంతో తోనే లోకమంతా ఉంది. ఈ విషయం లోని ఆంతర్యం గమనించాలి. ధనం లేని వాడు మృతునితో సమానం.

**అపి స్వర్ణ మయీ లంకా**
**న మే రోచతి లక్ష్మణ !**
**జననీ జన్మ భూమిశ్చ**
**స్వర్గాదపి గరీయసి.**

సోదరా, లక్ష్మణా ! ఈ లంక బంగరు మయ మయిన దైనప్పటికీ నాకు నచ్చదు. ఇక్కడ ఉండ లేను. ఎందుకంటే, తల్లి, పుట్టిన ఊరు స్వర్గం కంటె గొప్పవి కదా !

**కృషితో నాస్తి దుర్భిక్షమ్**
**జపతో నాస్తి పాతకమ్**
**మౌనేన కలహం నాస్తి**
**నాస్తి జాగరతో భయం.**

చక్కగా వ్యవసాయం చేస్తే కరవు అనేది ఉండదు. జపతపాలు చేస్తే పాపం పోతుంది. మౌనంగా ఉంటే ఎవరితోనూ విరోధమే ఉండదు. జాగురూకతతో ఉంటే దేనికీ భయపడే పని లేదు.

**గజానాం మంద బుద్ధిశ్చ సర్పాణా మతి నిద్రతా**
**బ్రాహ్మణానా మనేకత్వం త్రిభిర్లోకోపకారకమ్**

ఏనుగుల మంద బుద్ధి తనం, పాముల అతి నిద్రా గుణం, బ్రాహ్మణులలో ఉండే అనైక్యత... వీటి వల్లన లోకోపకారం జరుగుతోంది కదా!

**ర్జా ధర్మిణి ధర్మిష్ఠా, పాపే పాప పరా: సదా**
**రాజాను మను వర్తంతే, యథా రాజా తథా ప్రజా !**

రాజు ధర్మ పరుడయితే రాజ్యం ధర్మపథంలో నడుస్తుంది. పాప వర్తనుడయితే రాజ్యం పాప పంకిలమవుతుంది. ఎప్పుడూ ధర్మా ధర్మాలు రాజుని అనుసరించి నడుస్తాయి. రాజు ఎలా ఉంటే, ప్రజలూ అలాగే నడచుకుంటారు.

**పుస్తకం వనితా విత్తం**
**పర హస్తం గతం గత:**
**అథవా పునరా యాతి**
**జీర్ణం భ్రష్టా చ ఖండశ:**

పుస్తకం, స్త్రీ, ధనం ఇవి మన వద్ద ఉన్నంతసేపే. ఇతరులు చేతిలో పడితే మరి వాటి పని అంతే. తిరిగి వస్తాయనుకోవద్దు. ఒక వేళ వచ్చినా. సర్వ నాశనమయి పోయిన స్థితిలో మనకి తిరిగి దక్కుతాయి సుమీ. (స్త్రీని జాగ్రత్తగా చూసుకోవాలి అనే భావం ఇక్కడ గ్రహించాలి)

**శత నిష్కో ధనాఢ్యశ్చ**
**శత గ్రామేణ భూపతి:**
**శతాశ్వ: క్షత్రియో రాజా**
**శత శ్లోకేన పండిత:**

వంద నిష్కలు (ధన విశేషం) ఉన్నవాడే ధనవంతుడు అనిపించుకుంటాడు. వంద గ్రామాలకు అధిపతి అయిన వాడే భూపతి అవుతాడు. వంద గుఱ్ఱాలు కలవాడే రాజు అనిపించుకుంటాడు. వంద శ్లోకాలు వచ్చిన వాడే పండితుడు.

**విద్వత్త్వం చ నృపత్వం చ**
**నైవ తుల్యం కదాచన**
**స్వ దేశే పూజ్యతే రాజా**
**విద్వాన్ సర్వత్ర పూజ్యతే.**

పండితుడికీ, రాజుకీ పోలికే లేదు ! ఎందు కంటే, రాజు తన దేశంలో మాత్రమే పూజింపబడతాడు. కాని, పండితుడు లోకమంతా గౌరవించబడుతాడు.

**శతం విహాయ భోక్తవ్యం**
**సహస్రం స్నాన మాచ రేత్**
**లక్షం విహాయ దాతవ్యం**
**కోటిం త్యక్త్వా హరిం భజేత్**

వంద మందిని విడిచి పెట్టి అయినా భుజించాలి. వేయి మందిని విడిచి పెట్టయినా స్నానం చేయాలి. లక్ష మంది నీ వెంట రాక పోయినా దానం చేయాలి. కోటి మందిని విడిచి పెట్టయినా శ్రీహరిని సేవించుకోవాలి.

**అతి దానాత్ హత: కర్ణ:**
**అతి లోభాత్ సుయోధన:**
**అతి కామాత్ దశగ్రీవో**
**అతి సర్వత్ర వర్జయేత్**

(ఇది మరోవిధంగా కూడా ఉంది)

విచ్చల విడిగా దానం చేయడం వలన కర్ణుడు చెడాడు. మిక్కిలి స్వార్ధ గుణం చేత చెడాడు. అతి కామంచేత రావణుడు నాశనమయ్యాడు. కనుక అంతటా అతిని విడిచిపెట్టాలి. ఎప్పుడూ అతి పనికిరాదు. ఓవరాక్షను వికటిస్తుంది.

**సత్యాను సారిణీ లక్ష్మీ**
**కీర్తి: త్యాగాను సారిణీ**
**అభ్యాసాను సారిణీ విద్యా**
**బుద్ధి: కర్మాను సారిణీ.**

లక్ష్మీ దేవి ఎప్పుడూ సత్యాన్ని అనుసరించే ఉంటుంది. ఎక్కడ సత్యం ఉంటుందో అక్కడ సంపద ఉంటుంది. అలగే, కీర్తి త్యాగాన్ని అనుసరించి ఉంటుంది. త్యాగ గుణం లేనిదే కీర్తి ప్రతిష్ఠలు రమ్మంటే రావు. అభ్యాసం లేనిదే విద్య అలవడదు. నిత్యం చదవనిదే చదువు ఎలా వస్తుంది? అభ్యాసం కూసు విద్య కదా. ఇక, బుద్ధి కర్మను అనుసరించి ఉంటుంది. చెడి పోయే రాత మనకి ఉంటే మన బుద్ధి చెడు త్రోవలోను, బాగు పడే రాత ఉంటే మన బుద్ధి మంచి దారిలోను ప్రవర్తిస్తుంది. బుద్ధి మన కర్మలను అనుసరించి ఉంటుంది సుమా!

**న నిర్మితో వై నచ దృష్ట పూర్వో**
**న శ్రూయతే హేమ మయం కురంగ:**
**తథా2పి తృష్ణా రఘు నందనస్య**
**వినాశ కాలే విపరీత బుద్ధి:**

బంగారు లేడి ఉన్నదని ఎన్నడయినా విన్నామా? ఎప్పుడయినా ఎక్కడయినా అయినప్పటికీ రాముడు తన చెలి కోరిందని ముందు వెనుకలు యోచించ కుండా బంగారు లేడిని తెస్తానని వెళ్ళాడు. వినాశ కాలం దాపురించిన నాడు ఇలాంటి విపరీత బుద్ధులే పుడుతూ ఉంటాయి. చెడ్డ కాలం వచ్చినప్పుడు తర్కం పని చెయ్యదు. బుద్ధి మందగిస్తుంది.

**ఋణ కర్తా పితా శత్రు:**
**మాతా చ వ్యభిచారిణీ**
**భార్యా రూపవతీ శత్రు:**
**పుత్ర: శత్రురపండిత:**

అప్పు చేసి, మనకి ఆస్తి కాకుండా అప్పు మిగిల్చే తండ్రి మనకి శత్రువుతో సమానం. వ్యభిచరించే తల్లి శత్రువు. రూపవతి అయిన భార్య శత్రువు. పండితుడు కాని కుమారుడు శత్రువు.

**ఆత్మ బుద్ధి: సుఖం చైవ**
**గురు బుద్ధిర్విశేషత:**
**పర బుద్ధి ర్వినాశాయ**
**స్త్రీ బుద్ధి: ప్రళయాంతక:**

మనకి తోచినది చేయడం అన్నిటి కన్నా మేలు. పెద్దల సలహా ప్రకారం నడచు కోవడం ఇంకా మంచిది. కాని పరుల (శత్రువుల అని కూడా అర్థం చెప్పు కోవచ్చును) ఆలోచనల మేరకు నడచుకోవడం నాశనం కొని తెచ్చు కోవడమే. ఇక, ఆడువారి ఆలోచనల బట్టి నడుచుకుంటే ప్రళయమే సుమా!

**అసమర్ధస్య సాధూనాం**
**నిర్ధనస్య జితేంద్రియ:**
**వార్ధక్యే దేవతా భక్తి:**
**వృద్ధ నారీ పతివ్రతా.**

అసమర్ధుని మంచితనం, ధనం లేని పేద వాని ఇంద్రియ నిగ్రహం, ముసలి తనంలో దైవ భక్తి, వయసు ఉడిగిన ఆడుదాని పాతి వ్రత్యం ఒక్కలాంటివే.

**ముఖం పద్మ దళాకారం**
**వచ శ్చందన శీతలం**
**హృదయం కర్తరీ తుల్యం**
**అతి వినయం ధూర్త లక్షణమ్**

ముఖమేమో, పద్మం లాగా ఉంటుంది. మాటలేమో చందనం వలె చల్లగా ఉంటాయి. కాని, దుర్జనుని మనసు మాత్రం కత్తెర పిట్టలాంటిది. అతి వినయం చూపడం చెడ్డ వాడి లక్షణం సుమా.

**సిద్ధ మన్నం ఫలం పక్వం**
**నారీ ప్రథమ యౌవ్వనం**
**కాలక్షేపం నకర్తవ్యం**
**ఆలస్యం అమృతం విషమ్**

వండిన అన్నాన్ని భుజించడానికీ, పండిన పండును కొరుక్కు తినడానికీ, యౌవ్వన వతి పొందును స్వీకరించడానికీ ఆలస్యం చేయరాదు సుమా! ఆలస్యం చేస్తే అమృతం కూడా విషమై పోతుంది. అన్నం చల్లారిపోవడం, పండు కుళ్ళిపోవడం, యౌవ్వనం తరగిపోవడం జరుగుతాయి. ఆలస్యం చేయడం వల్ల అమృతం కూడా విషతుల్యమవుతుంది.

**విశ్వా మాత్రా హి పశుషు, కర్ద మేషు జలేషుచ**
**అంధే తమసి వార్ధక్యే, దండం దశ గుణం భవేత్.**

పక్షులు, కుక్కలు, శత్రువులు, పాములు, పశువులు వీటిని అదుపు చేయడానికి వరుసగా, బురదలో, నీటిలో, చీకటిలో, గ్రుడ్డితనంలో, ముసలి తనంలో సాయంగా ఉండేది చేతి కర్ర. అందువల్ల దండానికి (కర్రకి) దశగుణాలు ఉన్నాయి సుమీ!

ఇవీ మూల వాక్యాలకి పూర్తి పాఠాలు.

పూర్వులు చెప్పిన దానిని మార్చరాదు

**సేకరణ :**

# ఉచిత డాక్టరు

ఎవ్వరూ కాదనలేని నిజం. ఎక్కడైనా సరే ఈ క్రింది చూపిన ఆరుగురు డాక్టర్లు : 1) సూర్యకాంతి, 2) నీరు, 3) గాలి, 4) విశ్రాంతి, 5) వ్యాయామం, 6) ఆహారం. ఈ ఆరు మిమ్ములను సంతోషంగా వుంచుతాయి. మీలో ఏమైనా రుగ్మతలు ఉంటే పారద్రోలుతాయి. మీరు పైసా ఇవ్వకపోయినా మీ సంరక్షణ బాధ్యత వహిస్తాయి.

- ఆస్పత్రుల చుట్టూ తిరగటం అనాగరికం – ప్రకృతిని అనుసరించటం నాగరికం.
- మన కోరికలే మన రోగాలు – మన ఇష్టాలే మన కష్టాలు.
- నియమముతో ముసలి ముసలితనాన్ని మర్చిపో – మనసుకు లేదు కదా ముసలితనం మహిలో.
- నిత్యకృత్యాలతో ఇమిడిన వ్యాయామం – చేస్తుంది జీవితమంతా ఆరోగ్యమయం.
- తిండి పెరిగితే సొమ్ముకు చేటు – బరువు పెరిగితే తనువుకు చోటు.
- డబ్బుతో పొందిలేనిది – డబ్బు కన్నా ముఖ్యమైనది ఆరోగ్యం.
- సంతృప్తి అనే ధనం మనిషిని ఆర్యోగవంతునిగా చేస్తుంది.

# 'రాగము'తో రోగ నివారణం!

## ఎం.ఎస్. రాగం విన్నంతనే రక్తపోటు పోయిందట!

'ఓం' కార రూపంగానే 'శబ్దం' 'అక్షరం' జనించాయని భారతీయులు విశ్వసిస్తారు. అందుకే పూర్వం 'ఓం నమశ్శివాయ నమః' అంటూ అక్షరాభ్యాసం చేసేవారు. అక్షరాల దిద్దుబాటు చేసేవారు.

'సామవేదం' నుంచే సంగీతం ఉత్పన్నమైనదనే విషయం కూడా భారతీయులు విశ్వసిస్తారు. అసలు తెలుగు అక్షర క్రమమే వేదపరంగా జనితమైంది. వేదం నుంచీ ప్రకృతి నుంచీ భారతీయ సంగీతం పుట్టింది. త్యాగరాజు వంటి మహా భక్తులు తమ సంగీతాన్ని ఎంతో పవిత్రంగా, రామార్పణంగా కీర్తించారు. కర్ణములకు వేద సుస్వరంగా సంతుష్టిపరచేవిగా, కర్ణాటక సంగీతం దక్షిణ భారతంలో సంగీతం వృద్ధి చేసింది. ఇటు భరత కూచిపూడి, కథక్కళి, ఒడెస్సీ నృత్యాలను సహితమూ రంజింపచేసింది. లలిత మనోహరమైన జానపద గీతాలకు కూడా ఈ సంగీతమే మూలమైంది. పశుపక్ష్యాదులను సహితమూ పరవశింపచేసే ఈ సంగీతం ప్రాణికి ఆనందం ఆహ్లాదం సమకూరుస్తుందనీ, రోగం రొచ్చులను నివారణ చేస్తుందని సిద్ధాంతపరంగా ఆయుర్వేద శాస్త్రజ్ఞులు గుర్తించారు.

ఏదైనా 'శంఖు'లోంచి పోస్తే తీర్థమైనట్టు మనకు ఇంగ్లీషు వాళ్లు చెబితే సత్యమవుతుంది. ఇటీవల అమెరికన్ సొసైటీ ఆఫ్ హైపర్ టెన్షన్ వారు ఎం.ఎస్.సుబ్బలక్ష్మి పాడిన కొన్ని కర్ణాటక సంగీత కాసెట్లనూ, సుప్రభాతం సి.డి.ని రవిశంకర్ 'సితార' సి.డి.లను పెట్టి అధిక రక్తపుపోటు రోగాన్ని నివారణం చేశారట. ఇవి ఉత్తుత్తమాటలు కావు. ఆ రోగుల చెంత రోజుకి అరగంట చొప్పున నెల రోజులపాటు ఆ పాటల సి.డి.ని వినిపించి వారి రక్తపోటు పూర్తిగ నివారణ కావడం గ్రహించారు.



మేఘమలర్ రాగంతో వర్షం కురిపించడం, దీపక్ రాగంతో జ్యోతులను (దివ్వెలు) వెలిగించడం వంటివి అక్బర్ కాలంలో తాన్‌సేన్ వంటి వారు ప్రయోగాలు చేసి విజయులైనట్టు చరిత్రలో వింటూనే ఉన్నాం. సంగీత రోగాలనూ, రుగ్మతలనూ నివారిస్తుందన్న మాట ఆయుర్వేద శాస్త్రజ్ఞులు చెప్పినప్పటికినీ కొందరు ఆధునికులు విశ్వసించలేదు. ఇప్పుడే అమెరికన్ సొసైటీ ప్రయోగం దాన్ని నిజం చేసింది.

నిస్సత్తువ, ఆస్మా, క్షయ, టైఫాయిడ్, హిస్టీరియా, రక్తపుపోటు, మధుమేహం వంటి వ్యాధులను రాగాలు నివారింపచేస్తాయనెడి సత్యం విదితమవుతుంది. రోగాలను రగిలించే క్రిములను నిర్మూలిస్తూ, హార్మోనులను క్రమబద్ధం చేసే శక్తి ఈ రాగస్వరానికి ఉంటుందని డా॥ తంబు అనే ఆయనకూడ చెప్పారు.

శివరంజని రాగం జ్ఞాపకశక్తిని పెంచుతుందనీ, తోడి భూపాల రాగాలు రక్తపుపోటు (బి.పి)ని తగ్గిస్తాయనీ, ధృత్ రాగం డిప్రెషన్‌నూ, మాలో లాస్ రాగం ఆస్మాను తగ్గి స్తుందనే, ప్రియదర్శిని, సామవేద రాగాలు రక్తహీనతనూ మధుమతి దీపక్ రాగాలు అల్సర్‌నూ, జానా పురి, జేబ్ వంతి రాగాలు డయాబిటిస్‌ను, మాల్కోస్, బసంత్ బహార్ రాగాలు హైఫీవర్‌నూ, భైరవి దీపక్ రాగాలు ఇన్‌స్సోనియా, మిర్వా, దీపక్, కళావతి రాగాలు అసిడిటీని నివారణ చేస్తూందనీ ఇలా సంగీతంలోని వివిధరాగాలు వివిధ రోగాలను నివారణచేస్తుందనీ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. చెన్నయ్‌లోని రాగా రీసెర్చిసెంటర్ ఈ విషయంగా ఎంతో కృషి పరిశోధనా చేస్తుంది. పరివ్రాజకులు, అవధూత శ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారు తమ కచ్చేరీల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

రాగంతో రోగనివారణ మవుతుందనేది సత్యమవుతుంది. ●

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

Beautiful City - Beautiful Hotel



DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

జి.వి. రావ్ పేజీ
(గోటేటి వేంకటేశ్వరరావు)

శరీరం, మనస్సు ఎంత పవిత్రంగా ఉంటే అంత తొందరగా మీరు గమ్యం చేరుతారు. మనస్సులో చెడు ఉద్దేశాలు రానివ్వకూడదు. వస్తే మీరు పతనమైనట్లే. - స్వామి వివేకానంద




# అద్వితీయ వ్యక్తిత్వం శ్రీ గోటేటి శ్రీరామారావు

## (07-3-1933 - 23-11-2018)

ఈ నవంబరు 23కి మమ్మల్ని విడిచి ఆయన వెళ్ళి రెండు సంవత్సరాలయ్యింది. 85 సంవత్సరాల జీవితకాలంలో 74 ఏళ్ళు ఆయన జీవనం కలంతోనే, తెలుగు పత్రికా చరిత్రలో నాకు తెలిసినంతవరకూ ఇంతటి అవిశ్రాంత కృషి చేసినవారు ఎవరూ లేరు. భారతదేశ పత్రికా చరిత్రలో కూడా అంటే అతిశయోక్తి కాదేమో. ఆయన జీవితకాలాన్ని ప్రముఖాంధ్రకు ముందు. ప్రముఖాంధ్రకు తరువాత అవి రెండుగా విభజించుకుంటూ మొదటి 60 సంవత్సరాలకు మించిన కృషి, రెండవ 25 సంవత్సరాలలో రెట్టింపయ్యింది. ఆయన షష్ట్యబ్ద పూర్తి తరువాత అంటే అందరూ జీవితంలో రిటైర్డ్ అయ్యే సమయంలో ఆయన కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు అదే "ప్రముఖాంధ్ర". మొదటి 50 సంవత్సరాలలో ఆయన నడిపిన, పత్రికలు కాని, సినిమాలు కాని ఆయనకివ్వని పేరుప్రఖ్యాతులు తరువాత 25 సంవత్సరాలలో ప్రముఖాంధ్ర ఇచ్చింది. మొదటి 50 సంవత్సరాలలో ఆయనేవి పెద్దగా సంపాదించలేదు, పైగా పోగొట్టుకున్నదే ఎక్కువ. అయినా మొక్కవోని ధైర్యంతో ప్రముఖాంధ్రను ఉచిత పత్రికగానే నడిపారు. ఏవో పెద్ద సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాలు చెయ్యవలసిప పని, కాని ఆయన దడవక, వెరవక ఆ పత్రికను తీసుకుని వచ్చారు. ఆ పత్రిక కోసం ప్రకటనల ద్వారా, చందాల ద్వారా, విరాళాల ద్వారా వచ్చిన సొమ్మునంతా ఆ పత్రిక కోసమే ఖర్చుపెట్టారు. అంతేకాదు ఆయన ప్రోగుచేసిన డబ్బు కూడా ప్రముఖాంధ్ర కోసం ఖర్చు చేసారు. ఎందుకలా, అదేవన్నా దేశసేవ? అంత కష్టపడి నడపాలా, మూసెయ్యచ్చుగా, ఎందుకలా నడపడం, అని మీరడగవచ్చు. మేము (కుటుంబ సభ్యులం) అడిగాం. కాని, ఆయన వినిపించుకోలేదు. ఆయన తెలుసుకున్న, నేర్చుకున్న తెలుగు విజ్ఞానాన్ని, తెలుగు భాషా సౌందర్యాన్ని నలుగురికి పంచాలనుకున్నారు. ఇది ఒక రకంగా విద్యాదానం.

ఏ పత్రికలు రాయని, చూడని తెలుగు కవులు, నాయకులు, పండుగలను గురించి, తెలుగు విశేషాలను, తెలుగు దేవుళ్ళను, తెలుగు రాజులను, తెలుగు ప్రదోలుని రేయింబవళ్ళు సేకరించి తన బాణీలో ప్రస్తుతం మూలపడిపోయి, తెలుగే వన్నా తిండి పెడుతుందా అని ప్రశ్నించేవారికోసం, దేశవిదేశాల్లో బహుళప్రాచుర్యం పొంది, ఎక్కువమంది మాట్లాడే భాష కానరాకుండా పోకూడదని, అడుగంటి పోకూడదని ఆర్తితో, భాషపై ప్రేమతో రకరకాలుగా విశేషంగా, విస్తృతంగా, వినయంగా, అందంగా అలంకరణలతో ఆయన ప్రముఖాంధ్రలో ప్రచురించారు. ఆ పత్రికలో సామాన్య తెలుగువారి నుంచి అసమాన్య తెలుగువారి వరకూ పరిచయం చేసారు. మలేషియా, మారిషియస్‌లో అభిమాన సంఘాలేర్పడేతంటి అభిమానాన్ని సంపాదించారు. అంతేకాదు, భారతదేశంలో అన్ని రాష్ట్రాలకి, అండమాన్ దీవులకు ఇక విదేశాలలో, అమెరికా, కెనడా, దుబాయి, సింగపూర్, మలేషియా, బ్యాంకాక్, నేపాల్ వంటి విదేశాలకు తెలుగు భాషా అంబాసిడర్‌గా వెళ్ళి తన గళాన్ని వినిపించారు. ఆయన భాషపై చూపిన నిర్విరామ కృషి, నిరంతర శ్రమ అవును 80 ఏళ్ళ వృద్ధాప్యంలో కూడా ఆయన పడిన తాపత్రయాన్ని చూసి ఆయన స్నేహితులు. కుటుంబంలో మేము ఆయనకు పూర్తి సహకారాన్నిచ్చాం. ముఖ్యంగా ఆయన వైశ్యమిత్రులు ఆయనకు బలం, బలగం. ఆయన చివరి రెండు సంవత్సరాలు అనారోగ్యంలో వున్నప్పుడు అంత ఇబ్బందులలోను పత్రిక మంచం మీద పడుకునే మేటర్ ఇచ్చేవారు. ఆ పత్రిక ఈ 26 సంవత్సరాలు



నిరాటంకంగా ఒక్క నెల కూడా విరామం ఇవ్వకుండా విడుదల చేసాం. ఆయనకు ఆ పత్రిక మీద ఉన్న మమకారం, నన్ను ప్రభావితం చేసి ఎలాగైనా ప్రముఖాంధ్రను నడపాలని, తెలుగు పత్రిక చరిత్రలో "ప్రముఖాంధ్ర" ప్రకాశించే ధ్రువతారగా వెలగాలని ఆశయంతో, ఆ మహనీయుడు దివికేగి రెండు సంవత్సరాలయిన ఆయన స్ఫూర్తి, చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం మమ్మల్నీ పత్రికను నడిపిస్తోంది.

ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రముఖాంధ్రను నడపాలని కృత నిశ్చయంతో వున్నాం. మాకు ఆయన స్నేహితులే అండ... దండ. వారి ఆశీస్సులు, ప్రోత్సాహంతో ముందుకెడుతున్నాం. ఈ రెండు సంవత్సరాలు పత్రిక నాణ్యతగాని, వ్యాసాల కూర్పులో గాని ఏమాత్రం తగ్గకుండా చూసుకుంటున్నాం. కొంతమంది నాన్నగారి స్నేహితులు మా వెన్నంటి వున్నారు. ఇంకొంతమంది కూడా మునుపటిలాగా ప్రోత్సహస్తారని ఆశాభావంతో వున్నాను. నేనెవరిని ఈ రెండు సంవత్సరాలు అడగలేదు. అడగనిదే అమ్మైనా పెట్టదంటారు కదా. అందుకని ఇక మెల్లిగా అడుగుదామనుకుంటున్నాను. వారు ఇస్తారు, ప్రోత్సహిస్తారు అని నాకు తెలుసు.

మమ్మల్ని మనసారా ఆశీర్వదించండి. ప్రముఖాంధ్రను ప్రోత్సహించండి.

మీ

గోటేటి వెంకటేశ్వరరావు

# GOTETI GRAPHICS

- Business Cards
- Letterheads
- Brochures
- & Company profiles

- Invoice
- Vouchers
- Receipts & Register
- Delivery Challan Books

- Wedding Cards
- Invitation Cards
- Other occasion Cards

- Dance Arangetram Cards & Hotel Menu Cards
- Merit Certicicates.

We stand prominent in the industry when it comes to delivery

- Hard cover
- Soft cover
- Perfect Bind
- Spiral bind
- Wiro bind & Comb Binding

- Books
- Magazines
- In-house magazines
- Souvenirs
- Diaries

- Prayer & Hymn Books, Music Books, Exercise Books, Note Books, Answer Books & Practical Note Books

GOTETI GRAPHICS

Complete Service from Designing to Delivery

*The Complete Printing Solutions*

GOTETI GRAPHICS

64 (16), Thambiah Road
West Mambalam
Chennai - 600 033
INDIA

☎ : 044 2474 2091 / 2371 6322
✆ : 098400 48941
E-mail : gotetigraphics@gmail.com

*Our print support creates a remarkable value in your business*

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
November 2020

REGN. No. TN/CC(S)DN/177/18-20
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97

